



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 9 | ది. 5-4-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 9 | Date : 5-4-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


# లక్ష్యాల మేరకు రాజధాని పనులు పూర్తి చేయాలి

- వేగం మరింత పెరగాలి... ఐకానిక్ ముద్ర కనిపించాలి
- నిర్మాణ సంస్థలు కడుతోంది కేవలం బిల్డింగులు కాదు... రాజధాని
- రాజధాని పనులకు గ్రీన్ ఛానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్
- ప్రభుత్వ శాఖలు, అధికారులు సమన్వయంతో జాప్యం లేకుండా చూడాలి
- అమరావతి రాజధాని పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రాజధానిలో అగ్నిప్రమాదాలపై సీఎం అసంతృప్తి... నిర్మాణ సంస్థలదే బాధ్యతని స్పష్టం



**అమరావతి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం చేస్తామని.. ఈ మేరకు పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధికారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్ అన్నట్టుగా భావించవద్దని... చరిత్రలో భాగస్వాములు అవుతున్నట్టుగా భావించాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలవైన పనులు ఉండగా... వాటిల్లో రూ. 50, 943 కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదుపాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది...లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అవసరమైన మ్యాన్ పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కాంట్రాక్టర్లు సీఎం దృష్టికి తెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా చాలా మంది కార్మికులు వెళ్లారని నిర్మాణ సంస్థ ప్రతినిధులు చెప్పారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రాజధాని పనుల్లో ఎంత మెషినరీని వినియోగిస్తున్నారనే అంశం పైనా సీఎం ఆరా తీశారు. రాజధాని పనుల్లో 5,580 మెషినరీ అవసరముండగా... ప్రస్తుతం 3767 మెషనరీ ఉందని అధికారులు వివరించారు. ఇవి కాకుండా హాట్ మిక్స్ 16, వెట్ మిక్స్ మెషిన్లు 36, ఆర్ఎంసీ మిషన్లు 34 ఉన్నాయని తెలిపారు. వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని రాజధాని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను... నిర్దేశించుకున్న టార్గెట్లను విశ్లేషిస్తే... వారానికి రూ. 941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే వర్షా కాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది కాబట్టి... ఆలోగానే చేపట్టాల్సిన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కువ ప్రాజెక్టులను చేపడుతున్న నిర్మాణ సంస్థలు మరింతగా దృష్టిని కేంద్రీకరించి పనులు చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దు... ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే. నిర్మాణ సంస్థలుగా ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలి. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే.. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉంది... ప్రతీ నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యమెందుకు...?..** సమీక్ష సందర్భంగా ఇటీవల రాజధాని ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటన ప్రస్తావనకు వచ్చింది. నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు లేదా అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయన్నారు. ఘటన జరిగిన తర్వాత కాంట్రాక్టు సంస్థలు కానీ... అధికారులు కానీ తగిన రీతిలో స్పందించలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని... ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలెర్ట్ చేయాలని ఆదేశించారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా... ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు.. బురద జల్లేందుకు, కుట్రలు పన్నేందుకు కొందరు సిద్దంగా ఉన్నారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆయా నిర్మాణ సంస్థలు కూడా ప్రాజెక్టు మేనేజర్లుగా సమర్థులను నియమించుకోవాలని సూచించారు. సరైన వాళ్లని నియమించుకోకుంటే... ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తాను అనుమతించనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లకు ఆదేశాలు..** రాజధాని పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ కొరత కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలో ఫారెస్ట్ అధికారుల కారణంగా గ్రావెల్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉందని.. జిల్లా కలెక్టర్ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నా... ఫారెస్ట్ అధికారులతోనే అసలు సమస్య వస్తోందనే విషయం సమావేశంలో సీఎం దృష్టికి వచ్చింది. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని.. ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సర్కారీ బడి.. ఇక ఇంటర్నేషనల్ స్టడీ!!

- పబ్లిక్ స్కూల్స్‌గా ప్రభుత్వ పాఠశాలల అప్‌గ్రేడ్
- ప్రి-ప్రైమరీ టూ పన్నెండో తరగతి
- ఒకే గొడుగు కింద అత్యుత్తమ విద్యా
- గ్లోబల్ పోటీకి విద్యార్థులను సిద్ధం చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రామగుండం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి, వాటిని కార్పొరేట్ స్థాయికి మించిన పబ్లిక్ స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా, ప్రి-ప్రైమరీ స్థాయి నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన సాగేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, సుశిక్షితులైన ఉపాధ్యాయుల ద్వారా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తామని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని రెట్టింపు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి పేద బిడ్డకు ప్రపంచస్థాయి విద్యను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేలా వారిని తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్ది, ప్రతి నియోజకవర్గంలో ఆదర్శవంతమైన పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ విప్లవాత్మక మార్పులకు తల్లిదండ్రులు సహకరించాలని, సర్కారీ బడులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. రాబోయే విద్యా సంవత్సరం నాటికి ఈ మార్పులు క్షేత్రస్థాయిలో కనిపిస్తాయని, విద్యా రంగంలో రామగుండం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెడతానని మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పునరుద్ఘాటించారు.

# అమరావతి ని కాపాడటంలో సుజనా చౌదరి ది ప్రధాన పాత్ర

- రైతుల ఉద్యమానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించింది సుజనానే
- ఎమ్మెల్యే సుజనా చౌదరికి రైతుల అభినందనల వెల్లువ...

**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మాజీ కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే సుజనా చౌదరి ని రాజధాని రైతులు , మహిళలు ఘనంగా సత్కరించి క్రుతజ్నతలు తెలిపారు. శనివారం సుజనా చౌదరి క్యాంపు కార్యాలయంలో అమరావతి రైతలు, మహిళలతో సుజనా చౌదరి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అమరావతిని కాపాడటంలో మొదటి రోజు నుంచి చివర వరకు సుజనా చౌదరి అండగా నిలిచి ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. ఆర్థికంగా, హార్ధికంగా ఆయన చేసిన సహకారం మరవలేనిది అన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టులలో న్యాయపరమైన అన్ని అంశాలలో మాకు అండగా నిలిచి మనో ధైర్యాన్ని ఇచ్చిన మహామనిషి సుజనా చౌదరి అని పలువురు కొనియాడారు. పార్టీలతో సంబంధం లేకుండా అమరావతి రాజధాని ఒక్క అంగుళం కూడా కదలదు అని మొదటే చెప్పిన వ్యక్తి సుజనా చౌదరి అని గుర్తు చేశారు. ఎప్పటికప్పుడు లాయర్లతో మాట్లాడి లీగల్ అంశాలు మాకు వివరించడంతో పాటు అప్పుడు డబ్బు మా వద్ద లేకపోయినా... ఆయనే ఖర్చులు పెట్టుకుని సహకారం అందించడం మరవలేమన్నారు. మాకు, మా ఉద్యమానికి అన్ని విధాల సహాయం చేసిన సుజనా చౌదరి మేము రుణపడి ఉన్నామని తెలిపారు. అమరావతి ని నిలబెట్టడంతో మాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెప్పడం మా ధర్మమని తెలిపారు. మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మేము ఇలా ఉత్సవాలు చేసుకుంటున్నామంటే వ్యక్తిగతంగా సుజనా చౌదరి అందించిన సహకారం చాలా కీలకమని కొనియాడారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం పాదయాత్రకు వెయ్యి కార్లతో భారీ ర్యాలీ పెట్టి మా అందరికీ ధైర్యం ఆయన ధైర్యం ఇచ్చారని తెలిపారు. మాకు దైవ సమానులుగా



ఇప్పటివరకు ఎలా అయితే సుజన సహకరించారో, ఇక మీదట కూడా అలాగే సహకరించాల్సినటువంటి అవసరం ఉందని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో లో కుల, మతాలకు అతీతంగా సమస్య పరిష్కరించాలన్నారు. రాజధాని అమరావతి విషయం లో నేను సాయం చేశానని అనుకోలేదని తన బాధ్యత అనుకుని చేశానన్నారు. అమరావతి విషయంలో కూడా నా వంతు బాధ్యత తో సహకారం అందించాను ఈ సమయంలో రామోజీ రావు కూడా మనకి చాలా సహకారం అందించారని గుర్తు చేశారు. అప్పటి వాస్తవాలు తెలిసేలా తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లోనూ పుస్తకాలు ముద్రించి రామోజీరావు వాటిని పంచే ఏర్పాటు చేశారని తెలిపారు. అమరావతి ఏర్పాటు సమయంలో ఆనాడు జగన్ తో సహా అన్ని పార్టీల వారి మద్దతు ఇచ్చారని తెలిపారు. ఎపి క్యాపిటల్ గా అమరావతి ని కేంద్రం రికార్డు ల్లో పెట్టడానికి అరుణ్ జైట్లీ, రాజ్ నాథ్ సింగ్ నాడు సహకారం అందించారని వివరించారు. ఆరోజు ఆంధ్రప్రదేశ్ తరపున రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాను. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు కూడా ఈ విషయంలో అనేక విధాలుగా సహకరించారు. రాజధాని అనేది కేవలం పరిపాలనా కేంద్రం మాత్రమే కాదు, అది ఒక 'గ్రోత్ ఇంజిన్ లాగా ఉండాలి అనేది తన అభిప్రాయమన్నారు. న్యూయార్క్ నగరం లాగా ఒక బలమైన వ్యవస్థను నిర్మిస్తే, ఎవరు వచ్చినా దాన్ని ఏమీ చేయలేరు. ఆ ఉద్దేశంతోనే చంద్రబాబు నాయుడు అమరావతికి పునాది వేశారని తెలిపారు. ఇండియా మ్యాప్ లో అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని కిందే ఉంది. నేడు మన గవర్నర్ గా ఉన్న అబ్దుల్ నజీర్ , మాజీ చీఫ్ జస్టిస్ నూతలపాటి వెంకటరమణ సలహాలు, సపోర్ట్ ఇచ్చారని వివరించారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ కి ఇప్పుడు అయ్యే అవకాశాలు కూడా నాకు కనపడట్లేదు. అప్పట్లో అమరావతి పేరు కూడా రామోజీరావు గారే సజెస్ట్ చేశారని , ఉద్యమం సమయంలో రామోజీ రావు ని నేను రెగ్యులర్ గా కలుస్తూ ఉండేవాడిని తెలిపారు. ఆయన మంచి చెడ్డ చెప్పేవారు కాబట్టి కచ్చితంగా. ఈ రోజు చెప్పాల్సిన సందర్భం వచ్చింది కాబట్టి నేను ఆయన పేరు తీసుకున్నానన్నారు. జగన్ కామెంట్ పై సుజనా కౌంటర్... జగన్ ఇప్పుడు మావి గన్ అని స్లోగన్ అందుకున్నారు, ఆ రోజు చెప్పాను... ఈరోజు చెబుతున్నా... ఎవరు వచ్చినా అంగుళం కూడా అమరావతి ని కదిలించలేరు. మావి గన్ కాదు మీరు ఏ గన్ తీసుకొచ్చినా అమరావతిని మాత్రం తాకలేరు. అమరావతి అంగుళంలో పదో వంతు కూడా ఎవరూ ముట్టుకోలేరు. అదేదో డైవర్షన్ పాలిటిక్స్ గా మాట్లాడుంటారు కానీ, ఆయన కూడా కావాలని చెప్పి మాట్లాడారని నేను అనుకోవడం లేదని తెలిపారు. ఆయన కు స్క్రిప్ట్ ఎవరు ఇచ్చారో... రాజకీయంగా జగన్ కు కూడా నష్టమేనని, ఆయనకి సలహాదారులు సరిగ్గా లేరేమో అని నాదొక అనుమానం, అని అభిప్రాయపడ్డారు. ఒకవేళ గనుక అలా మాట్లాడి ఉంటే... ఏ గన్ వచ్చినా.... అమరావతి అభివృద్ధి ఆగదు అని స్పష్టంచేశారు. కార్యక్రమంలో రైతులు యుగంధర్, కొమ్మినేని సత్యం, చిలకా బసవయ్య, బాల మురళీ, వరలక్ష్మి, శారద.. తదితరులు పాల్గొన్నారు.




# మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత

- స్వయం ఉపాధికి సరికొత్త మార్కెటింగ్
- మహిళా పారిశ్రామికవేత్తలకు షాపింగ్ మాల్స్ భరోసా
- సామాజిక బాధ్యతగా తొలి అడుగు వేసిన ఎల్ఈపీఎల్
- ఎన్టీఆర్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ



**విజయవాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మహిళల ఆర్థిక స్వావలంబనను బలోపేతం చేయడానికి, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందుతున్న మహిళలకు మార్కెటింగ్ రంగంలో కొత్త అవకాశాలు కల్పించే దిశగా ఎన్టీఆర్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ చొరవతో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానికంగా తయారు చేస్తున్న హస్తకళా ఉత్పత్తులు, ఇతర స్వయం ఉపాధి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అందించేందుకు షాపింగ్ మాల్స్‌లో ప్రత్యేక స్థలాలను కేటాయించడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించే కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం నగరంలోని ఎంజీ రోడ్డులోని ఎల్ఈపీఎల్ సెంట్రో షాపింగ్ మాల్‌లో అయిదుగురు మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చేలా కేటాయించిన స్టాల్లను కలెక్టర్లు లక్ష్మీశ, డీకే బాలాజీ ప్రారంభించారు. మహిళల స్వయం ఉపాధి ఉత్పత్తులను పరిశీలించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను విజయవంతంగా ముందుకు నడిపించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరవేసుకునే అవకాశం పొందుతారని, మధ్యవర్తుల అవసరం తగ్గి వారికి అధిక ఆదాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. ఆధునిక మార్కెటింగ్ పద్ధతులు, ప్యాకేజింగ్, బ్రాండింగ్ వంటి అంశాలపై కూడా వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా ఎల్ఈపీఎల్ సంస్థ ముందుకొచ్చి ఈ కార్యక్రమానికి మద్దతు అందించడం విశేషమని తెలిపారు. ఈ తరహా భాగస్వామ్యాలు మహిళల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ద్వారా ఇప్పటికే వివిధ శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని.. ఇప్పుడు మార్కెటింగ్ పరంగా చేయూతనిస్తున్నట్లు వివరించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్వయం ఉపాధి రంగంలో ఉన్న మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాలను మరింత విస్తరించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**మహిళలకు సుస్థిర ఆదాయం: డీకే బాలాజీ..** కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెట్ లింకేజీలు కల్పించడం ద్వారా స్థిరమైన ఆదాయం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి సామాజిక బాధ్యతగా తోడయ్యే ఇలాంటి చేయూతతో మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ముందుకెళ్తోందని.. ఈ లక్ష్యాల సాధనలో సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

# కాకినాడలోనే ఆయుర్వేద కళాశాల నిర్మాణం చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య ● మాజీ ఎమ్మెల్యే వర్మకు ఇచ్చిన భూమి రద్దు చేసే వరకు సీపీఐ పోరాటం ● కూటమి ప్రభుత్వం భూ మాఫియాకు పాల్పడుతోంది ● మాజీ ఎమ్మెల్యే కన్నబాబు ● పేదల స్థలాలకు టీడీపీ ఎసరు ● మాజీ ఎంపీ గీత ● భూ కబ్జాపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని కాంగ్రెస్ వెల్లడి



**కాకినాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో ప్రభుత్వం చెందిన మూడున్నర ఎకరాల స్థలాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్విఎస్ఎన్ వర్మకు కానుకగా ఇవ్వడం కూటమి ప్రభుత్వం చేస్తున్న దారుణమని ఆ స్థలంలోనే ఆయుష్ మెడికల్ కళాశాల నిర్మించాలని పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆయుర్వేద ఆసుపత్రి నిర్మించిన పక్కనే ఆ కళాశాల నిర్మించి ఆసుపత్రిని అందుబాటులో తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. శనివారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు అధ్యక్షతన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, ఆయుర్వేద ఆసుపత్రి పక్కనే మెడికల్ కళాశాల నిర్మించాలని, మాజీ ఎమ్మెల్యే వర్మకు కేటాయించిన 175 కోట్లు పైగా విలువ చేసే మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని రద్దు చేయాలంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం టూరిజం శాఖ పేరుతో ఎస్విఎస్ఎన్ కన్స్ట్రక్షన్స్ సంస్థకి కట్టబెడుతున్నట్లు ఒక జీవోను విడుదల చేసిందన్నారు. ఇందులో ఎటువంటి పూర్తి వివరాలు లేకుండా ప్రజలను మాయ చేసే విధంగా ఈ జీవోను విడుదల చేసిందని వారు చెప్పారు. మూడున్నర ఎకరాల భూమిని వర్మకు తాజ్ హోటల్ పేరుతో కట్టబెట్టే విధంగాను, అక్కడ నిర్మాణం చేయనున్న మెడికల్ కళాశాలను పిఠాపురంలోని పేదల ఇళ్ల స్థలాలకు ఇచ్చిన చోట నిర్మాణం చేసేందుకు చీకటి ఒప్పందాలు జరగనున్నట్లు ఆయా పార్టీల నేతలు తెలియజేశారు. ఉన్న 5 ఎకరాల్లో ఇప్పటికి 240 మందికి పట్టాలు ఇచ్చారని మిగిలిన వారికి కూడా పట్టాలిచ్చి ఆ భూమి అక్కడ పేదలకే ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వర్మకు ప్రభుత్వ భూమి ఇస్తే మాత్రం అటు న్యాయస్థానంలోనూ ఇటు ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రస్తుతం తరుణంలో వైద్యం పేదలకు అందడం లేదని కాకినాడకు ఆయుర్వేద కళాశాల రావడం మంచి శుభ పరిణామన్నారు. ఆయుర్వేద ఆసుపత్రి నిర్మించిన చోటే కళాశాలను కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. వైద్య నిబంధన నుంచి ఆసుపత్రి కళాశాల ఒకే చోట ఉండాలని ఆయన చెప్పారు. విశాఖలో 99 పైసలకు ఎకరానికి భూమిని శ్రామికవేత్తలకు కట్టబెడుతుందని చెప్పారు. అమరావతిలో లక్ష ఎకరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం సేకరిస్తున్నారని అక్కడ 99 పైసలకు భూమిని కేటాయించగలరని కూటమి ప్రభుత్వాన్ని, చంద్రబాబుని ఈశ్వరయ్య ప్రశ్నించారు. వర్మకిచ్చిన భూమిని రద్దు చేయాలని లేని పక్షంలో అమరావతిలో ఈ సమస్యలపై భారీ ఎత్తున ఉద్యమాన్ని లేవదీస్తామని ఈశ్వరయ్య హెచ్చరించారు. వర్మకు భూమి జీవోలో ఎక్కడా స్పష్టంగా ప్రభుత్వం ఇవ్వలేదని అతను మాత్రం దౌర్జన్యంగా ఆ భూమిని చదును చేసుకుంటూ తన ఆధీనంలో తెచ్చుకుంటున్నాడంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, పిసీసీ ఉపాధ్యక్షుడు మట్ట ప్రసాద్ పేర్కొన్నారు. తాజ్ హోటల్ కాకినాడలో నిర్మాణం చేస్తున్నట్టు ఎక్కడా ప్రకటించలేదని ఇది కేవలం టీడీపీ ఒక నాయకుని కోసం చేస్తున్న భూ కబ్జాని వారు ఆరోపించారు. ఈ కబ్జాపై జాతీయస్థాయిలో తమ అధిష్టానంకు ఫిర్యాదు చేయనున్నట్లు సత్యానందరావు, మట్టా ప్రసాదులు పేర్కొన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ చంద్రబాబు తన పార్టీ వాళ్ళ కోసం కాకినాడలో స్థలం ఇస్తున్నాడని పిఠాపురంలో పేదలకు ఇచ్చిన స్థలంలో ఈ కళాశాల నిర్మించి పేదల నోట్లో మట్టి కొడుతున్నాడన్నారు. ప్రభుత్వ భూములను లేని కంపెనీలకు తన వాలు కోసం కారు చౌకగా కట్టబెడుతున్నట్లు కన్నబాబు చెప్పారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని ఈ ఉద్యమానికి వైకాపా తన వంతుగా సహకరిస్తుందన్నారు. 99 పైసలకు ఎకరం భూమిని లీదుకిస్తున్న చంద్రబాబు తన హెరిటేజ్ కంపెనీలో ఒక్క చాక్లెట్ కూడా ఆధంకు రాదని చెప్పారు. మాజీ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ తమ హయాంలో ఆయుష్ కళాశాలకు స్థల సేకరణ కోసం కాకినాడ గర్ల్స్ పాలిటెక్నిక్ ఎంపిక చేసామన్నారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు. ఒక వ్యక్తి కోసం విలువైన భూమిని ధారాధత్తం చేయడం తగదని గీత సూచించారు. దీనిపై పోరాటం చేసేందుకు తమ వైసీపీ శ్రేణులు సహకరిస్తాయని గీత తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకుడు దువ్వ శేషబాబ్జి, ఆప్ నేత నరాల శివ, బిఎస్పీ నేత సుబ్రహ్మణ్యం, న్యాయవాది జవహర్ అలీ, ఐఎఫ్టియూ చేనేత తాళ్లూరు రాజు తదితరులు ప్రసంగించారు. పవన్ కళ్యాణ్ తన పదవికి అద్దు రాకుండా వర్మకు ఈ భూమిని అతి చౌకగా కట్టబెట్టి పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను లాగేసుకుంటున్నారన్నారు. ఈ భూకబ్జాపై హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామంటూ వారు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు తోకల ప్రసాద్, సుంకర విద్యాసాగర్, జెట్టావాద సత్యనారాయణ, కే బోడకొండ, యుగంధర్, పెద్దిరెడ్డి సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# గుడివాడలో ఘనంగా జరిగిన రన్ ఫర్ జీసస్





**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఈస్టర్ పర్వదిన సందర్భంగా గుడివాడలో పునరుత్థాన సువార్తను ప్రకటిస్తూ ప్రార్థిస్తూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఆరాధన టి.వి ఛానల్ సౌజన్యంతో ఘనంగా నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ డా. జి. శామ్ బాబు తెలిపారు. గుడివాడ పాస్టర్స్, విశ్వాసులు యౌవనస్తులు కలిసి చేసిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో బిషప్.డా. అప్పికట్ల జాషువా జి. కరుణాసాగర్, జి.ఏ. శేఖర్ నేలపాటి సామ్యూల్, సాల్వేషన్ ఆర్మీ మేజర్ జోసఫ్ అండ్ టీం, రెవ.వి. విజయ్ బాబు రెవ. కె. ఎలైజా,పాస్టర్స్ రత్నాకర్ స్టాన్లీ,పి. సునీల్ కుమార్, రెవ.కరుణ కుమార్,యెహెజ్కేలు,పాస్టర్.ఏలీషా, మణిపాల్ సీఎస్ఐ ప్రతినిధులు,లాయర్ చిలుకోటి రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ పాస్టర్ ప్రేయర్ ఫెలోషిప్ గుడివాడ,నందివాడ,ముదినేపల్లి దైవ సేవకులు పాల్గొని యేసుక్రీస్తు పునరుత్థాన సువార్తను ప్రకటించి ప్రార్థనలు చేశారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద నుండి ప్రారంభమైన ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నాగవరపాడులోని రీవైవల్ పెంతుకోస్తు చర్చి వద్ద ముగిసింది. ముగింపు సభలో పలువురు దైవజనులు ప్రార్థనలు చేసి ఆశీర్వాదాలతో ముగించారు.

# అంపాపురం ప్రజల చిరకాల కోరిక సాకారం చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు





**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** చెరువులు ఊరి ఉమ్మడి ఆస్తులని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులందరి పైన ఉందని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం బాపులపాడు మండలం అంపాపురం గ్రామంలో గత 14 ఏళ్లుగా పూడికతో నిండిపోయి నిరుపయోగంగా మారిన అంపాపురం కోడి కాలవ పునరుద్ధరణ పనులను ఆయన స్థానిక నాయకులు, రైతులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు కాలవ నుంచి గ్రామంలోని మూడు ప్రధాన చెరువులకు నీటిని అందించే ఈ కోడి కాలవ 14 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైంది. స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక, ఎమ్మెల్యే తన సొంత నిధులతో గతంలో అందించిన మూడు మోటార్ల సహాయంతో నీటిని లిఫ్ట్ చేసి నేరుగా చెరువులు నిండేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఆక్రమణలకు గురైన చెరువులను స్వయంగా పర్యవేక్షిస్తూ బాగు చేయించి అభివృద్ధి చేయడమే కాకుండా, త్వరలో ఈ చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అలానే ఎక్కడెక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలో చూసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 14 ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు గ్రామస్తులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ పార్టీ అధ్యక్షుల సుంకర రాజా వేణు గోపాల్,బాపులపాడు మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు వలివేటి కిషోర్ , టీడీపీ నాయకులు అల్లంశెట్టి శ్రీమన్నారాయణ, కోడె రేవంత్ ,యాళ్ళ శ్రీధర్, కోడె శ్రీనివాసరావు, దండుబోయిన రాంపండు, పుట్టి నాగరాజు, అల్లంశెట్టి శేషు , మోతుకూరి మాణిక్యాలరావు గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జి.కొండూరు మండలం గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికారులు వీరే...




**జి.కొండూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** గ్రామ పంచాయితీ పాలకవర్గం పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుం దని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా జి.కొండూరు మండలంలోని 22 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఏప్రిల్ 1వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్కూరు, హెచ్.ముత్యాలంపాడు,కందులపాడు గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా షీమా బేగం (డిప్యూటీ తాసిల్దార్ రీ-సర్వే) చెవుటూరు, గుర్రాజుపాలెం, వెంకటాపురం గ్రామ పంచాయతీ ల ప్రత్యేక అధికారిగా యం.వీరస్వామి (ఎంఈఓ-2) చిన నందిగామ, కోడూరు, వెల్లటూరు గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా వి.కృపా కుమార్ (డిప్యూటీ ఎంపీడీవో) సున్నంపాడు,చెర్వు మాధవరం, మునగపాడు గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా పి.విజయ్ కుమార్ (డిప్యూటీ తాహశీల్దార్) దుగ్గిరాలపాడు, గంగినేని పాలెం, తెల్లదేవరపాడు గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా కె.సిహెచ్.సూరిబాబు (మండల వ్యవసాయ అధికారి) గడ్డమణుగు, వెలగలేరు గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా యం.స్వరూప రాణి(ఎం.ఎస్.జి.వో) జి.కొండూరు, కట్టుబడిపాలెం,పినపాక గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా బి.వి.రామ కృష్ణ నాయక్ (ఎంపీడీవో) కవులూరు, కుంటముక్కల గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా సిహెచ్.సాంబశివరావు (మండల పంచాయతీరాజ్ ఏఈ).

# బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ





**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లో అట్లూరి శ్రీనివాసరావు -- సురేఖ దంపతుల ఏకైక పుత్రుడు త్రినాద్ వెంకట సాయి చౌదరి & అనుష్ణ ల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బాపులపాడు గ్రామంలో ఇటీవల మరణించిన టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ మండల టిడిపి కార్యదర్శి తూమాటి ప్రసాద్ రావు కుటుంబ సభ్యులను యార్లగడ్డ వెంకట్రావు పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, తూమాటి ప్రసాద్ రావు పార్టీకి అందించిన సేవలను స్మరించుకున్నారు. వారి మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం హనుమాన్ జంక్షన్‌లో టీడీపీ కుటుంబ సభ్యులు షేక్ సత్తార్ మాతృమూర్తి షేక్ గోరీ భీ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా వెంకట్రావు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం హనుమాన్ జంక్షన్‌లో గరికిపాటి నాగబాబు, నారాయణ గార్ల మాతృమూర్తి గరికిపాటి కనకదుర్గ గారు ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా వెంకట్రావు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.


# హెల్త్‌కేర్ రంగంలో మునగపాటి భార్గవరామ్‌కి ప్రత్యేక ఆహ్వానం




**విజయవాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఏఎన్‌యులోని ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఐసిఎస్ఎస్ఆర్ సహకారంతో జి ఎస్ టి 2.0 హెల్త్ కేర్ ఎఫర్డబిలిటీ.. సోషియో ఎకనమిక్ ఇంపాక్ట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నేటితో ముగిసింది. ఈ సదస్సుకు విభాగాధిపతి, సదస్సు డైరెక్టర్ ఆచార్య బట్టు నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, జి ఎస్ టి 2.0 లక్ష్యాలు, వాటి అమలు, సామాన్యులకు వాటివల్ల కలిగే ప్రయోజనాలపై ప్రసంగించారు. ఈ సదస్సుకు విజయవాడ నుండి సంధ్యా కంటి ఆసుపత్రి సీఈవో మునగపాటి భార్గవరామ్ ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. హెల్త్‌కేర్ రంగంలో అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. జి ఎస్ టి 2.0 అడ్మినిస్ట్రేటీవ్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు వంటివి మరిన్ని సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉన్నాయని పేర్కొన్నారు. నేడు హాస్పటల్ రంగంలో ఎన్నో వినూత్న మార్పులు సంభవించాయని కార్పోరేట్ రంగం దిశగా హాస్పటల్స్ యాజమాన్యాలు రూపుదిద్దుకుంటున్నాయని మునగపాటి భార్గవరామ్ పేర్కొన్నారు. ఈ సదస్సుకు నలుమూలల నుండి న్యాయవాదులు, అధ్యాపకులు విచ్చేసి పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అనంతరం భార్గవరామ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భార్గవరామ్ మాట్లాడుతూ, తన తండ్రి దివంగత డాక్టర్ ఎమ్.ఎన్. రాజు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. 40 సంవత్సరాలుగా సామాన్యుని చెంతకు సంధ్యా కంటి ఆసుపత్రి ద్వారా వైద్య చికిత్సలు అందించ బడుతున్నాయని స్పష్టం చేశారు.

# హనుమాన్ జంక్షన్ లో వైనాట్ షోరూం ప్రారంభం





**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రోజురోజుకు హనుమాన్ జంక్షన్ లో వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతుందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం ఉదయం హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్ లోని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రక్కన నూకల కాంప్లెక్స్ లో వైనాట్ ఎలక్ట్రానిక్స్ ఽ హోమ్ అప్లయన్స్ 42 వ బ్రాంచ్ ను సామ్ సంగ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ కే.కృష్ణసుమన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వైనాట్ ఎండి,జుజ్జువరపు వెంకట రాయుడు అతిథులను సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. అలాగే బ్లూ స్టార్ లిమిటెడ్ ఆంధ్ర ప్రదేశ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.ప్రకాశరావు సేల్స్ ను ప్రారంభించారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి, నూకల షాపింగ్ మాల్ యాజమాని నూకల గణేష్ మొదటి కొనుగోలు చేశారు ఈ కార్యక్రమంలో జెడ్పి టి సి మాజీ సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్, ఎన్ జి పెర్టిలైజర్స్ మేనేజర్ కాకరాల రాజేంద్ర ప్రసాద్, రైతు నాయకులు నందూరి సత్య వేంకటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ ప్రారంబోత్సవ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ చుట్టు పక్కల గ్రామాల నుంచి పలువురు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎవరు ఏమి అనుకున్నా ఆయన వస్తే సంబరాలే



**విస్సన్నపేట,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో టిడిపి శ్రేణులకు తిరువూరు నియోజకవర్గ యువ నాయకుడు ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు మండల టిడిపి పార్టీ కార్యాలయానికి ఆయన వస్తే పండుగ వాతావరణమే సంతరించుకుంటుంది అని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తి లేదని చెప్పాలి . గతంలో ఎలా ఉన్నా మన రాజధాని మన అమరావతి సంబరాల కార్యక్రమం విస్సన్నపేట మండలంలో జరిగిన సమయంలో గిరిబాబు పాల్గొంటారన్న సమాచారం అందడంతో మండలంలో అన్ని గ్రామాల నుండి నాయకులు కార్యకర్తలు మండల పార్టీ కార్యాలయానికి బారులు తీరటం జరిగింది. ఈ కార్యక్రమంలో అనుకొని పెన్నిధిలు అతిథుల రూపంలో రావటం బైక్ ర్యాలీ కేక్ కటింగ్ కార్యక్రమం జాతి నాయకులకు పూలదండలు వేయుట నివాళులర్పించుట తదితర కార్యక్రమాలలో పాల్గొనడం పార్టీ కార్యకర్తలు అభిమానులు సానుభూతిపరుల హృదయాలు ఆనంద డోలికలలో ఉరుతులుగాయని అనుకుంటున్నారు.

# టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడును వెంటనే తొలగించాలి

● వైసీపీ నాయకులు ధర్నా



**రౌతులపూడి/ కోటనందూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బిఆర్ . నాయుడు ని ఛైర్మన్ పదవి నుండి వెంటనే తొలగించాలని వైసీపీ నేత లాలం బాబ్జి డిమాండు చేశారు. శనివారం వైసీపీ అధ్యక్షులు వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి ,కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా సూచనలతో సీనియర్ వైసీపీ నాయకులు లాలం బాబ్జి ఆధ్వర్యంలో కోటనందూరు మండలం కొట్టాం గ్రామంలో ఆయా గ్రామ కార్యకర్తల నడుమ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అనంతరం కొట్టాం శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాలం బాబ్జి మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం (టీ టీ డీ) ప్రతిష్టను మసకబారుస్తూ,అశ్లీల ఆరోపణలు ఎదుర్కొంటున్న తరుణంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న టీటీడీ బోర్డు ఛైర్మెన్ బి.ఆర్. నాయుడు ని ఇంకా కొనసాగిస్తున్నాడంతో మరమం ఏంటని అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ఈ ఆది దేవుడి వెంకటేశ్వర స్వామిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండు చేశారు. కోటనందూరు మండలం పార్టీ శ్రేణులు, భక్తులు అభిమానులు నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ తలుపులమ్మ లోవ చైర్మన్ బొంగు బాబురావు, ఎంపీపీ లగుడు శ్రీనివాసరావు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదం కు బడ్డీ దగ్ధం



**మచిలీపట్నం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మచిలీపట్నం స్థానిక చిలకలపూడి సిడబ్ల్యూసీ గోడౌన్ దగ్గర శనివారం షార్ట్ సర్క్యూట్ తో ఒక బడ్డీ దగ్ధం అయ్యింది. బడ్డీలో నుండి తీవ్రమైన పొగలు మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళన చెంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బడ్డీ యజమాని వివరాలు తెలుసుకొని యజమానికి సమాచారం అందించారు. అనంతరం నష్టాన్ని తెలుసుకున్నారు . బడ్డీ లో అగ్ని ప్రమాదం ఎలా సంబంధించిందోనని దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమ ఇసుక రవాణా ను అడ్డుకున్న గ్రామస్థులు

● దాములురు గ్రామంలో ఇసుక రీచ్ లో సంఘటన





**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని దాములూరు ఇసుక రీచ్ లో శనివారం రగడ జరిగింది. ఇసుక రీచ్ లో జేసీబీతో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న నిర్వాహకులను దాములూరు గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో నిర్వాహకులు, గ్రామస్థుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సేకరించిన వివరాల ప్రకారం దాములూరు ఇసుక రీచ్ లో తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు చెబుతున్నారు. జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపట్టడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సర్వే నంబర్ లో ఇసుక తవ్వకాలు చేపట్టకుండా అనుమతి లేని సర్వే నంబర్ లో జేసీబీతో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేపట్టి రైతుల లంక భూముల్లో ర్యాంపు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూముల్లో ట్రాక్టర్లు, లారీలు తిరిగితే సహించేది లేదని గ్రామస్థులు హెచ్చరించారు. గ్రామస్థులు, నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో నిర్వాహకులు ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. జేసీబీని అక్కడ నుంచి తరలించి ఒడ్డుకు చేర్చారు. నిర్వాహకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# సిపిఎం పార్టీ నేతలు ఆధ్వర్యంలో ధర్నా




**ఆత్మకూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలోని 19వ వార్డు సచివాలయం వద్ద నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో స్థానిక ప్రజలు సిపిఎం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు..198 జీవో ప్రకారము మున్సిపాలిటీ పరిధిలో ఉండే గృహాలకు ప్రతి ఏడాది పన్నులు పెంచుతూ పేద ప్రజలకు భారంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉండే 198 జీవోను వెంటనే రద్దుపరచాలని అలాగే పెంచిన పన్నులను తగ్గించాలని ఏడాదిలో నూట యాభై రోజులు పేదలకు పనులు కల్పించాలని కోరుతూ నిరసన తెలిపారు.. నిరసన అనంతరం సచివాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు.

# అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు రూ.20 లక్షలు హామీ

## -ఎంపీ వద్దిరాజు ముఖ్య అనుచరుడు నవతన్ కృషి



**భద్రాద్రి కొత్తగూడెం జిలా,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర రూ.20 లక్షల రూపాయలు ప్రకటించారు.తెలంగాణ ఉద్యమకారుడు, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నవతన్ విజ్ఞప్తి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు,ఆయన కుమారుడు రాఘవ సిఫార్సు మేరకు రవిచంద్ర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు ఇస్తానని ప్రకటించారు.కొత్తగూడెంలో పర్యటిస్తున్న ఎంపీ రవిచంద్రను నవతన్ కలిసి హాల్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదన వివరాలను అందజేశారు.తన విజ్ఞప్తి పట్ల వెంటనే సానుకూలంగా స్పందించడంతో నవతన్ సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి వెంకటేశ్వరరావు,ఆయన కుమారుడు రాఘవలకు ధన్యవాదాలు తెలిపారు.

# పాఠశాలకు బల్లలు అందజేసిన పూర్వ విద్యార్థులు



**మైలవరం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మండలంలోని పుల్లూరు గ్రామం చిలుకూరివారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు పాఠశాల కు అవసరమైన బల్లలను బహుకరించారు. ఉపాధ్యాయులు ఉపయోగించుకోవటానికి వీలుగా తయారు చేయించిన 12 బల్లలను శనివారం ప్రధానోపాధ్యాయురాలు అన్నే కుసుమ కుమారి ద్వారా పాఠశాలకు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాల కల్పనకు తమ వంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుంటక ప్రసాద్ రెడ్డి, వై.నరసింహారావు, బసివి రెడ్డి, అప్పారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి, ఎమ్మెల్యే





**పెనమలూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** పెనమలూరు నియోజకవర్గం, పెనమలూరు మండలం, పెనమలూరు లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్ మధ్యాహ్న పథకం భోజనాన్ని పరిశీలించి ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో టీచర్ల గురించి అడిగి తెలుసుకున్న మంత్రి రవీంద్ర గతంలో లావు బియ్యం పెట్టేవారని, ఇప్పుడు సన్న బియ్యం భోజనం పెడుతున్నారని మంత్రికి తెలిపిన విద్యార్థులు విద్యార్థులకు స్వయంగా మంత్రి, ఎమ్మెల్యే భోజనం వడ్డించి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్. ఈ సందర్భంగా మంత్రి కొలు రవీంద్ర మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పై విద్యార్థులు చాలా సంతృప్తిగా ఉన్నారు కూటమి ప్రభుత్వం ఏర్పడినాక సన్న బియ్యంతో పౌష్టికాహారంపై దృష్టి పెట్టి విద్యార్థులకు మంచి భోజనం అందజేస్తున్నామన్నారు. ఆకుకూరలు ఏరోజు పెట్టాలి, పప్పు కూరలు ఏ రోజు పెట్టాలి అని ఒక షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు అందజేస్తున్నాం ప్రతిరోజు భోజనంతో పాటు ఒక గుడ్డు కూడా విద్యార్థుల ఆరోగ్య దృశ్య అందజేస్తున్నాం గత ప్రభుత్వంలో దోడ్డు బియ్యం, రేషన్ బియ్యం తో విద్యార్థులకు భోజనం పెట్టి వాళ్ళ ఆరోగ్యంతో ఆడుకున్నారని ఆరోపించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన ఎజెండాగా ఈ భోజనాలు పెట్టడం జరుగుతుంది, రాష్ట్రంలో సుమారు 2500 పాఠశాలలకు మోడల్ కిచెన్ ఏర్పాటు చేయబోతున్నమని తెలిపారు. 2162 కోట్ల రూపాయలు కేవలం మధ్యాహ్నం భోజన పథకానికి తాము ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ప్యూరిఫైడ్ మంచినీరు అందిస్తున్నామని తెలిపారు మంత్రి నారా లోకేష్ మధ్యాహ్న భోజన పథకం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. ప్రతిపక్షాలు కావాలని కుట్రలు పన్నుతున్నారని అన్నారు పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల స్థితిగతులు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలిసేలా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో మెగా డీఎస్సీతో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేసామన్నారు తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా తల్లుల ఖాతాల్లో 15000 రూపాయలు జమ చేసాము, ముఖ్యమంత్రి చంద్రబాబు చిన్న పిల్లలకు సోషల్ మీడియా పై ఆంక్షలు విధించే దానిపై పరిశీలన చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యాశాఖ పై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు గతంతో పోలిస్తే 100% మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర తో కలిసి విద్యార్థులతో భోజనం చేయడం సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. నెలలో ఒక్కసారైనా ప్రజా ప్రతినిధులు స్కూల్ లను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమినాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు - మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు

## -మైలవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లో సైబర్ క్రైమ్ పై అవగాహన వర్క్‌షాప్





**మైలవరం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు అని,అవగాహన లోపం వల్ల కష్టపడి సంపాదించి న ధనం సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లిపోతుందని మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు అన్నారు.సైబర్ క్రైమ్‌లపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఎన్టీఆర్ జిల్లా సీపి ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు,రూరల్ డీసీపి లక్ష్మీనారాయణ మార్గదర్శకత్వంలో,మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు పర్యవేక్షణలో మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కొత్తూరు కిషోర్ బాబు ఆధ్వర్యంలో మైలవరం,జి.కొండూరు,రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ ఎస్ఐలు సుధాకర్, సతీష్ కుమార్ , శ్రీను, గిరి సాయి సమన్వయంతో స్థానిక లకిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శనివారం మధ్యాహ్నం సైబర్ క్రైమ్ పై అవగాహన వర్క్‌షాప్ జరిగింది.ఈ వర్క్‌షాప్ లో ఆయా మండలాలకు చెందిన అన్ని బ్యాంకు ల మేనేజర్లు, తహశీల్దార్లు ఎంపీడీవోలు ఇతర మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐ కిషోర్ బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తుత సైబర్ నేరాల మోడస్ ఒపెరాండి పై సమగ్ర వివరణ ఇచ్చారు.వివిధ మీడియా క్లిప్పింగ్స్ మరియు వీడియోల ద్వారా ప్రజలను మోసం చేసే పద్ధతు లను వివరించారు.అనంతరం బ్యాంకు అధికారు లకు కొన్ని ముఖ్యమైన సూచనలు, సలహాలు ఇచ్చారు.అనుమానాస్పద లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని,అసాధారణ ప్రవర్తనతో వచ్చిన కస్టమర్లను గమనించి అవగాహన కల్పించాలని,సైబర్ సురక్షా పాంప్లెట్లలోని సూచనలను రోజూ పీక్ అవర్స్ సమయంలో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ద్వారా ప్రసారం చేయాలని సూచించారు.అలాగే మండల మరియు గ్రామ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ స్థాయి సమావేశాల్లో సైబర్ క్రైమ్ పై ప్రాథమిక అవగాహన కల్పించాలన్నారు. ఓ టి పి (OTP) ఎవరితోనూ పంచుకోవద్దని, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని ప్రజలకు తెలియజే యాలని,"డిజిటల్ అరెస్ట్" వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని ట్రేడింగ్ యాప్స్, లోన్ యాప్స్, బెట్టింగ్ వంటి మోసాలకు దూరం గా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నా రు.ఏదైనా సైబర్ మోసం జరిగితే గోల్డెన్ అవర్ ప్రిన్సిపల్ పాటిస్తూ వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బు ఫ్రీజ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించా రు.మరోవైపు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కూడా సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సహకరించాలని సీఐ కోరారు.ఈ వర్క్‌షాప్ ద్వారా బ్యాంకులు మరియు ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసి గ్రామ స్థాయి వరకు సైబర్ క్రైమ్ అవగాహనను విస్తరించేందుకు సహకరించాలని అధికారులకు సీఐ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశం - ఎం.ఎల్.ఎ కాగిత కృష్ణ ప్రసాద్....



**కృత్తివెన్ను,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ ప్రజాదర్బార్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజల నుంచి పలు సమస్యల పై అర్జీలను స్వీకరించి ముఖ్యంగా గ్రామాల్లో వీధిలైట్లు నీటి సమస్య, రోడ్ల ఏర్పాటు భూ ఆక్రమణలు రెవెన్యూ విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై పలువురు అర్జీల రూపంలో వినతి చేశారు ప్రజా దర్బారులో ప్రజలు ఇచ్చిన అర్జీలు, ఫిర్యాదు పత్రాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పరిశీలించి పరిష్కరించ గల అర్జీల పై నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధ వహించాలని సంబంధించిన శాఖ అధికారులకు సూచించడం జరిగింది. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను బాధ్యతతో స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నాము. రైతుల భూ సమస్యలపై వచ్చిన అర్జీల పట్ల ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా వి.ఆర్.ఏ. వీఆర్వో స్థాయి నుంచి తహసిల్దార్ వరకు అందరూ వేగవంతంగా పరిష్కరించే జవాబుదారితనంగా ఉండాలని సూచించడం జరిగింది....

# పాత దుస్తులతో బ్యాగులు... పర్యావరణానికి మేలు

● సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు విద్యార్థుల సృజనాత్మక ప్రత్యామ్నాయం ● రీయూజ్, రిడ్యూస్‌పై అవగాహన పెంపు ● విద్యార్థుల్లో సృజనాత్మకతకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అభినందనలు



**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం ఉదయం వన్ టౌన్ లో గల మహాత్మా గాంధీ పాఠశాలలో వినియోగించిన పాత దుస్తులతో బ్యాగుల తయారీ పోటీల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాత దుస్తులను తమ చేతులతో బ్యాగ్ కుట్టి తీసుకువచ్చిన వారితో మాట్లాడారు. ఈ బ్యాగ్ దేనితో కుట్టారు? అని అడిగితే, వారు పాత దుస్తులతో కుట్టామని సమాధానం ఇచ్చారు. పాత దుస్తులను మనం ఎందుకు వాడాలి? అని అడగ్గా ఏదైనా వస్తువుని తిరిగి వాడటం, వ్యర్థాలని తగ్గించడం అవుతుందని వారు సమాధానం ఇచ్చారు. పాత గుడ్డలనే ఎందుకు వాడాలి ప్లాస్టిక్ ని వినియోగించొచ్చుగా? అని అడిగితే, సింగిల్ యూస్ ప్లాస్టిక్ హానికరం అందుకే పర్యావరణహితమైన వస్తువులనే వాడాలి అని విద్యార్థులు కలెక్టర్ గారికి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు విఎంసి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి లక్ష్మీశ పాత దుస్తులతో అందమైన బ్యాగులుగా కుట్టి తీసుకొచ్చిన విద్యార్థిని విద్యార్థులకు అభినందించారు, వారి సృజనాత్మకతను మెచ్చుకున్నారు. ఇలాగే ప్రతి ఒక్కరు వారు కుట్టి తీసుకువచ్చిన గుడ్డ సంచుల ను వాడాలని వారి తల్లిదండ్రులకి ఆ సంచులనే మార్కెట్ కి తీసుకువెళ్లి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని అన్నారు. తాజాగా వచ్చిన అధ్యయనం ప్రకారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ అండ్ వాడటం వల్ల తల్లిపాలలో కూడా మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు కనిపిస్తున్నాయని.. ప్లాస్టిక్ భూమిలో కరగనందున అది మన పర్యావరణం లో హానికరమైన పదార్థంగా మారుతోందని అందుకే పర్యావరణహితమైన వస్తువులనే వాడాలని, కేవలం వాతావరణానికి, భూమికి హాని కలుగుతున్నందుకే కాదు, మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవటానికైనా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి అన్నారు. వేడి వేడి ఆహారం, ప్లాస్టిక్ లో వేయడం వలన హానికారక రసాయనాలు అందులో ఉత్పన్నమవుతాయని, ఆ ఆహారాన్ని మనం తినటం వలన అది క్యాన్సర్ కు దారితీస్తుందని అన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త అన్నారని, వారిలో ఉన్న సృజనాత్మకతను విస్తృతంగా వాడి ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు. ఈ వేసవి సెలవుల్లో పాత గుడ్డలతో ఎక్కువ సంఖ్యలో బ్యాగులను తయారు చేయాలన్నారు. ఎవరైతే ఎక్కువ బ్యాగులు చేస్తారో వారికి ప్రత్యేక అవార్డును ఇస్తామని వారి తల్లిదండ్రులను సన్మానిస్తామని తెలిపారు. అలా విద్యార్థులు కుట్టిన గుడ్డ సంచులను రైతుబజార్లలో ప్రజలకు ఉచితంగా ఇచ్చి వారికి అవగాహన కల్పించి కేవలం గుడ్డ సంచులను వాడేటట్టు సమాజంలో ఒక మార్పు తీసుకొద్దామని విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చంద్రకళ, విజయవాడ నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సాంబశివరావు,విఎంసి అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి అన్నపూర్ణ, గాంధీజీ మున్సిపల్ స్కూల్ హెడ్ మాస్టర్ కె. మల్లికార్జున్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# బి.ఆర్.నాయుడిని పదవి నుంచి తొలగించాలి - వైసీపీ నేతల డిమాండ్




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడును పదవి నుంచి తొలగించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఏ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బి.ఆర్.నాయుడుపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కాపాడుతున్నారని ఆరోపించారు. హిందువుల మనోభావాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందని విమర్శించారు. బి.ఆర్.నాయుడిని తొలగించే వరకు నిరసనలు కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం చంద్రబాబు ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను కాపాడాలని, హిందూ ధర్మాన్ని, హిందువుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని నినదించారు. కార్యక్రమంలో వైసీపీ కొండపల్లి పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనులపండువగా వీరమ్మ తల్లి సంబరాలు...



**గుడ్లవల్లేరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** వందేళ్ల చరిత్ర కలిగిన మామిడికోళ్ల శ్రీ వీరమ్మ తల్లి సంబరాలు కనులపండువగా జరిగాయి. అమ్మవారి ఆలయంలో పోలీల్ని కట్టి, వసంతోత్సవం ఆడి, అమ్మవారిపై తమ భకి ?తప్రపత్తుల్ని చాటుకున్నారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకునేందుకు అమ్మవారి ఊరేగింపులో తల్లి ప్రభల్ని ఏర్పాటు చేశారు. ఊరేగింపులో చిత్ర విచిత్ర శక్తి వేషధారణలతో కనక డప్పుల వాయిద్యాలు, కోలాటాలతో ప్రభలకు అలంకరించిన విద్యుద్దీపాలు భక్తుల్ని ఆకట్టుకున్నాయి. ఆలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలను చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్ చిత్తర్వు నాగేశ్వరరావు, హైకోర్టు ప్రముఖ న్యాయవాది చిత్తర్వు రఘు, ఎస్బీఐ న్యాయ సలహాదారు చిత్తర్వు వేణుగోపాలరావు, డాక్టర్ చిత్తర్వు మధు, చిత్తర్వు శుభ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టించుకోని పంచాయతీ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి



**కంకిపాడు, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యలపై పంచాయతీ సిబ్బంది పట్టించుకోకుండా అలసత్వం వహిస్తున్నారని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పెనమలూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు సంగపు రంగారావు అన్నారు. పెనమలూరు మండలం, గోసాల గ్రామంలోని భవనారాయణ స్వామి ఆలయం దగ్గర ఉన్న వీధిలో , చెత్తా,చెదారం పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు తిరుగుతున్నాయి శుభ్రం చేయాలని పలుమార్లు పంచాయతీ సిబ్బందికి తెలియచేసిన వారు చేస్తామని చెబుతున్నారు కానీ గత వారం రోజుల నుంచి పంచాయతీ సిబ్బంది ఎవరు శుభ్రం చేయకుండా వదిలేశారు. ప్రజాప్రతినిధి బీసీ సెల్ అధ్యక్షులు రంగారావు స్వయంగా మొక్కలు తొలగించి వీధిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల పంచాయతీ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడం అలసత్వానికి నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధిగా ఉన్న నా మాటే పంచాయతీ సిబ్బంది వినలేదంటే, సామాన్య ప్రజల సమస్యల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఏప్రిల్ 7న ఇగ్నో 39వ స్నాతకోత్సవం




**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈ నెల ఏడో తారీఖున 39వ స్నాతకోత్సవాన్ని న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 51 ప్రాంతీయ కేంద్రాల్లో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం సన్నాహాలు చేస్తున్నట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె సుమలత శనివారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంలో జరిగే స్నాతకోత్సవానికి గౌరవ భారత ఉపరాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. అలాగే విజయవాడ ప్రాంతీయ కేంద్రంలో నిర్వహించే స్నాతకోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె మధు మూర్తి గౌరవ అతిథిగా విచ్చేయనున్నారు. దేశవ్యాప్తంగా 3,24,835 డిగ్రీలను ఈ స్నాతకోత్సవంలో ప్రధానం చేయనున్నారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో 1,626 డిగ్రీలను ప్రధానం చేయనున్నారు. స్వయంగా డిగ్రీలను అందుకునేందుకు ఫీజు చెల్లించిన విద్యార్థులందరూ ఏడవ తారీఖు ఉదయం 10 గంటలకు కల్లా విజయవాడ వన్ టౌన్ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో జరిగే 39వ స్నాతకోత్సవానికి విద్యార్థులు తప్పనిసరిగా హాజరై వారి వారి పట్టాలను అందుకోవాలని సుమలత తెలియజేశారు.

# రాతిక్వారీలలో ఆగని రిగ్ బ్లాస్టింగ్....!

● భీకరమైన ధ్వనులకు కంపిస్తున్న ఇంటి భవనాలు ● రిగ్ బ్లాస్టింగ్ లకు అనుమతులు నిల్
● పట్టించుకోని రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారులు





**జి.కొండూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రాతి క్వారీలలో అనుమతులులేని రిగ్ బ్లాస్టింగులతో ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు, గడ్డమణుగు, గ్రామాలు దద్దరిల్లి పోతున్నాయి. ఈ రాతి క్వారీలలో నిబంధనలకు విరుద్ధంగా రిగ్ బ్లాస్టింగ్ లు చేస్తున్నా రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.రాతి క్వారీల లో 150 నుంచి 180 అడుగుల మేర రిగ్ బోర్లు వేసి జిలెటిన్ స్టిక్స్, ఎలక్ట్రికల్ డిటోనేటర్లతో పాటు ఇతర పేలుడు పదార్థాలను ఉపయోగించి కొండలను పేల్చడం వల్ల ఆ భీకరమైన ధ్వనులకు భూమి కంపించి చుట్టుప్రక్కల సుమారు 10 కిలోమీటర్లు పరిధిలో ఉన్న పక్కా గృహాలు, భవనాలపై వత్తిడి పెరగటం తో గోడలు బీటలు వారుతున్నాయి.ఇంటిలో ఉన్నవారు భూ ప్రకంపనాలకు ఉలిక్కి పడుతున్నారు.ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులకు కనీసం పట్టించుకోవడంలేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సాయంత్రం 6 గంటల తరువాత రాతిక్వారీలలో అతి శక్తి వంతమైన జిలెటిన్ స్టిక్స్ మందును వాడి బ్లాస్టింగ్ లకు పాల్పడుతున్నారు. రిగ్ బోర్లు వేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిలు వాపోతున్నారు.రాతి క్వారీల నిర్వహకులకు అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాతి క్వారీలలో అతి ప్రమాదకరమైన రిగ్ బ్లాస్టింగ్ లను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

# నెల్లూరులో లాడియా 6వ స్టోర్ ప్రారంభం

-ల్యాబ్-గ్రోన్ డైమండ్ రంగంలో సరికొత్త విప్లవం!



**నెల్లూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** భారతదేశంలోనే అతిపెద్ద ల్యాబ్-గ్రోన్ డైమండ్ స్టోర్ అయిన లాడియా తన 6వ బ్రాంచ్‌ను నెల్లూరులో ఘనంగా ప్రారంభించింది. "వజ్రాలు అందరికీ సొంతం" అనే నినాదంతో నమ్మకమైన మరియు వినూత్నమైన డిజైన్లను లాడియా అందిస్తోంది.నెల్లూరులో ఏర్పాటు చేసిన ఈ నూతన షోరూమ్‌ను ప్రముఖ సినీ నటి మానస వారణాసి వైభవంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరు సాత్విక తదితరులు పాల్గన్నారు.ఈ సందర్భంగా లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరు మాట్లాడుతూ ల్యాబ్-గ్రోన్ డైమండ్ రంగంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందుతోందనీ ఆ ప్రయాణంలో భాగంగా సరికొత్త ఐడియాలతో మేము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఆభరణాలకు పెట్టింది పేరైన నెల్లూరులో మా 6వ స్టోర్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందనీ తెలిపారు. వడ్డాణాలు నెక్లెస్‌లు గాజులు పెండెంట్లు బ్రాస్‌లెట్లు కమ్మలు జుంకాలు ఉంగరాలు మరియు ప్రత్యేకమైన ల్యాబ్-గ్రోన్ పోల్కి ఆభరణాలు ఇక్కడ లభిస్తాయనీ మీకు నచ్చిన డిజైన్‌ను మీరే సొంతంగా తయారు చేయించుకోవచ్చునని ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఐజిఐ సంస్థ ద్వారా సర్టిఫై చేయబడిన వజ్రాలు మాత్రమే ఇక్కడ దొరుకుతాయనీ సరసమైన ధరలు క్యారెట్ వజ్రం ధర కేవలం రూ. 24,999 నుండే ప్రారంభమవుతుందనీ స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏప్రిల్ 04 నుండి ఏప్రిల్ 19, 2026 వరకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు.వజ్రాల ధర మరియు మేకింగ్ ఛార్జీలపై ఫ్లాట్ 15 శాతం తగ్గింపు జీరో వేస్టేజ్ సౌకర్యం అద్భుతమైన వజ్రాల ప్రపంచాన్ని చూడటానికి నెల్లూరులోని లాడియా స్టోర్‌ను సందర్శించండి!అని తెలిపారు.

# దాసాంజనేయ స్వామి ఆలయానికి పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం విరాళం

**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** జి కొండూరులో దాస ఆంజనేయస్వామి ఆలయానికి ప్రముఖ పారిశ్రామిక కోగంటి సత్యనారాయణ లక్ష యాభై వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కోగంటి సత్యం మాట్లాడుతూ పేద ప్రజలు అందరూ బాగుండాలనీ , తాను చాలా పేదరికం నుంచి వచ్చాననీ, అందువల్ల నేను కూడా నాకున్న దాంట్లో ఎంతో కొంత సహాయం చేస్తున్నానని చెప్పారు.అందులో భాగంగా కొండూరు లోని పురాతన ఆలయం లో కార్యసిద్ధి దాసాంజనేయ స్వామి మూల విరాట్ పున ప్రతిష్ట సందర్భంగా గుడి అభివృద్ధి కొరకు లక్ష 50 వేల రూపాయలు విరాళంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కోగంటి సత్యం ని కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గుడి స్థల దాత దగ్గుమల్లి చిన్న బుచ్చయ్య, అల్తాఫ్ బాబా, గరికిపాటి జైపాల్ ,కమిటీ సభ్యులు గుంటక సుబ్బారెడ్డి,పామర్తి వెంకటనారాయణ, నాగేశ్వరావు, రమేష్ ప్రతాపరెడ్డి,నాగ వెంకట్,సుబ్బారావు, వెంకటేశ్వరవు, పి.సుజాత, సుధీర్, శేషుబాల, రాంబాబు, డి డి. మురళి.. తదితరులు పాల్గొన్నారు.



# డిసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేయాలి

● విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర




**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** నగరంలో డిసిల్టింగ్ పనులను విస్తృతంగా చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా బాబు రాజేంద్రప్రసాద్ రోడ్డు వన్ టౌన్, కేటి రోడ్డు పంజా సెంటర్, కేఎల్ రావు ఔట్ఫాల్ డ్రైన్, హెచ్. బి. కాలనీ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డీసిల్టింగ్ పనులు విస్తృతంగా జరుగుతున్నాయని, చిన్న కాలువ దగ్గర నుండి మేజర్ అవుట్ఫాల్ డ్రైన్ల వరకు డీసిల్టింగ్ ఒక ప్రణాళిక బద్ధంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ పనులు వేసవికాలంలో చేయటం వల్ల ఒకవైపు దోమలను నియంత్రించటమే కాకుండా రానున్న వర్షాకాలంలో కూడా నీటి ప్రవాహంలో ఎటువంటి ఆటంకం లేకుండా రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.తదుపరి హెచ్ బి కాలనీ లోగల అన్న క్యాంటీన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్లు కచ్చితంగా ప్రతిరోజు పర్యవేక్షించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతి చిన్న సమస్యను సత్వరమే పరిష్కరించాలని అన్నారు .ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్ర బోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# 548మంది రోగులకు ఉచిత వైద్యం...




**గుడ్లవల్లేరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 548మందికి రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పటల్ వైద్యులు తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు. ఆదివారం వచ్చే రోగులకు విజయవాడ కామినేని హాస్పటల్, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, గుడివాడ హోమియో డాక్టర్ భవాని, గుడ్లవల్లేరు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, హైదరాబాదు మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు డాక్టర్ వెంకట్రావు తెలిపారు.

# తిరుమల పవిత్రతను కాపాడాలి

● విద్యాధరపురంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో...... ● మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు ● టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ ● ఎన్నికల ముందే బి.ఆర్. నాయుడి దుర్మార్గాల గురించి చంద్రబాబుకు లేఖ అందినా ఎందుకు స్పందించలేదు? ● హిందూ ధర్మంపై నమ్మకం లేని వ్యక్తిని టిటిడి చైర్మన్‌గా ఎలా కొనసాగిస్తారు? ● తిరుమలలో ఇన్ని అపచారాలు జరుగుతుంటే పవన్ కళ్యాణ్ మౌనం ఎందుకు? ● కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి పవిత్రతతో ఆడుకుంటే స్వామి వారి ఆగ్రహం తప్పదు




**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోని ఆలయాల్లో వేంకటేశ్వర స్వామికి వైకాపా శ్రేణుల నిరసనగా మొర పెట్టుకొంటున్నారు సాక్షాత్తు సీఎం చంద్రబాబు నాయుడు తిరుమలలో రీల్స్ చేస్తుంటే కేసులు ఎందుకు పెట్టడం లేదని మాజీ మంత్రి వెల్లంపల్లి ప్రశ్నించారు. పశ్చాత్తాప దీక్షలు చేసిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు జరుగుతున్న తప్పిదాలపై ఎందుకు నోరు మెదపరని తిరుమల పవిత్రతను కాపాడాలి.. బి.ఆర్. నాయుడిని వెంటనే తొలగించాలి డిమాండ్ చేశారు.తిరుమల తిరుపతి దేవస్థానం (టీ టీ డి) పవిత్రతను కాపాడాలని మరియు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న ప్రస్తుత టీ టీ డి చైర్మన్ బి.ఆర్. నాయుడును వెంటనే పదవి నుండి తొలగించాలని కోరుతూ మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు వైసీపీ శ్రేణులతో కలిసి నేడు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం విద్యాధరపురంలోని మువ్వల వారి వీధిలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) చైర్మన్ బి.ఆర్. నాయుడు ప్రవర్తన, ఆయనకు సంబంధించిన వివాదాస్పద అంశాలు సాక్షాత్తు కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి పవిత్రతను మంటగలుపుతున్నాయ న్నారు. చైర్మన్ వ్యవహారశైలి, ఆయనపై వస్తున్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వంలోని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ మౌనంగా ఉండటం దారుణమని పేర్కొన్నారు.బి.ఆర్. నాయుడు గతంలో ఒక మహిళతో ఉన్న వీడియో ఫుటేజీల బయటకు వచ్చాయని, సదరు మహిళ 2024 ఎన్నికల ముందే సాక్షాత్తు తెలుగుదేశం పార్టీ ఆఫీసులో చంద్రబాబు నాయుడికి లేఖ రాసి బి ఆర్ నాయుడు దుర్మార్గుడని అలంటి వ్యక్తిని చేరతీయవద్దని లేఖలో ఆమె పొందుపరిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అటువంటి దుర్మార్గుడిని, హిందూ ధర్మంపై కనీస అవగాహన లేని వ్యక్తిని పవిత్రమైన టిటిడి చైర్మన్ పీఠంపై ఏ ప్రాతిపదికన కూర్చోబెట్టారని ప్రశ్నించారు. గతంలో జరగని తప్పులకు పశ్చాత్తాప దీక్షలు చేసిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు కళ్ళముందే ఇన్ని అపచారాలు జరుగుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీసారు.తిరుమలలో భక్తులు వీడియోలు తీస్తే కేసులు పెడుతున్న ప్రభుత్వం, సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడ రీల్స్ చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదని, వేంకటేశ్వర స్వామి పవిత్రతతో ఆడుకుంటే స్వామి వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తక్షణమే బి.ఆర్. నాయుడిని చైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఈ అపచారాలకు నిరసనగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున స్వామి వారికి మొరపెట్టుకున్నట్లు వెల్లడించారు. పరమ పవిత్రమైన తిరుమల ప్రతిష్టను భంగం కలిగించేలా ప్రస్తుత చైర్మన్ బి.ఆర్. నాయుడు అనుసరిస్తున్న తీరు, ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నాయని మండిపడ్డారు. పవిత్రమైన దేవస్థానాన్ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చడం తగదని, ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని ఆయన విమర్శించారు.తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తుడిపై ఉందని, అందుకే స్వామివారిని వేడుకుంటూ ఈ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వెలంపల్లి తెలిపారు. తక్షణమే బి.ఆర్. నాయుడుని చైర్మన్ పదవి నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు ఎండి రుహుల్లా, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మరియు పార్టీ శ్రేణులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరల పెరుగుదలపై భగ్గుమన్న ఆటో డ్రైవర్లు..

-జవహర్ నగర్ గోగ్యాస్ వద్ద భారీ ఆందోళన



**జవహర్ నగర్, ఏప్రిల్ 4 (వార్తాప్రభ)** పెరిగిన ఆటో గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఆటో కార్మికులు సమరశంఖం పూరించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ ఫైరింగ్ రేంజ్ దగ్గర గోగ్యాస్ (గో గ్యాస్) ఫిల్లింగ్ స్టేషన్ వద్ద శనివారం ఐక్యంమతం ఆటో యూనియన్ అధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో రూ. 57 గా ఉన్న గ్యాస్ ధరను ఏకంగా రూ. 125 కు పెంచడాన్ని నిరసిస్తూ ఐకమత్యం ఆటో యూనియన్ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరల పెంపుతో బతుకు భారమైందని, తెలిపారు. ఐక్యంమతం ఆటో యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కట్టా కృపవరం మాట్లాడుతూఒక్కసారిగా గ్యాస్ ధరను డబుల్ కంటే ఎక్కువగా పెంచడం వల్ల ఆటో కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "గతంలో రూ. 57 ఉన్న ధరను నేడు రూ. 125 కు పెంచడం దుర్మార్గం. ఈ ధరలతో ఆటోలు నడపడం అసాధ్యం. పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం" అని ఆయన తెలియజేశారు. ఈ ఆందోళనలో పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్మికులు ?యూనియన్ జనరల్ సెక్రటరీ కూరాకుల నర్సింగ్ రావు నేతృత్వంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వందలాది మంది ఆటో డ్రైవర్లు తరలివచ్చి గోగ్యాస్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కట్టా కృపవరం (రాష్ట్ర అధ్యక్షుడు, ఐక్యంమతం ఆటో యూనియన్) కూరాకుల నర్సింగ్ రావు (జనరల్ సెక్రటరీ)కనపూర్ మారుతి (యూనియన్ ప్రతినిధి) రాపోలు శంకర్ (యూనియన్ ప్రతినిధి) ఎస్. బాలరాజ్ (జేఎంసి, జీహెచ్ఎంసి ఉపాధ్యక్షుడు) నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆటో కార్మికులు ఈ ఆందోళనలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. పెరిగిన ధరల వల్ల రోజువారీ ఆదాయం అంతా గ్యాస్‌కే సరిపోతుందని, కుటుంబ పోషణ భారంగా మారిందని డ్రైవర్లు ఈ సందర్భంగా తమ ఆవేదన వ్యక్తం చేశారు.

# బీఆర్ నాయుడును పదవి నుండి తొలగించండి

● క్యాంపు కార్యాలయం నుండి ఆలయం వరకు ర్యాలీ ● వెంకటేశ్వరస్వామి గుడిలో ప్రత్యేకపూజలు



**ఆత్మకూరు,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును పదవి నుండి వెంటనే తొలగించాలని కళంకితుడైన ఆయన ఆ పదవిలో కొనసాగేందుకు అనర్హుడని వైఎస్సార్సీపీ ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి సూచనలతో బీఆర్ నాయుడును పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ నాయకులు స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలుత ఆత్మకూరులోని మాజీఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుండి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి లీగల్ సెల్ అధ్యక్షులు నందా ఓబులేసు అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పవిత్రమైన తిరుమలలో అనేక ఘోరమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని అంతేకాక పలు దేవాలయాల్లో తొక్కిసలాట ఘటనలతో ప్రజల ప్రాణాలను కూడా కోల్పోయారని అన్నారు. మహిళలు ఎక్కడ మర్యాద పొందుతారో అక్కడ దేవతలు సంచరిస్తారన్న మాటకు కూటమి ప్రభుత్వంలో విలువ లేకుండా పోయిందని, మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్న నాయకులకు కొమ్ము కాస్తూ ఇష్టారీతిలో నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు.గత ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో టీటీడీ చైర్మన్ గా ఉన్న వ్యక్తి పై చిన్న ఆరోపణ వస్తేనే అతనిని ఆ పదవి నుండి పక్కకు తొలగించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీడియో ఆధారాలతో దొరికిన వ్యక్తిని కూడా మద్దతు పలుకుతుందని దేవుడు అన్ని చూస్తున్నాడని రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు కూనం సుధాకర్ రెడ్డి వైఎస్సార్సీపీ మండల కన్వీనర్లు పులగం శంకర్ రెడ్డి బిజివేముల పిచ్చిరెడ్డి చెన్ను వెంకటేశ్వరరెడ్డి పులిమి రమేష్ రెడ్డి జడ్పీటీసీ రావుల లక్ష్మీప్రసాద్ గౌడ్ బట్రెడ్డి జనార్ధన్ రెడ్డి షేక్ పర్వీన్ మాజీ సర్పంచ్ శోభ ఎస్సీ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు పట్టణ ఉపాధ్యక్షులు ఆంద్రా సుబ్బారెడ్డి నియోజకవర్గ పలు విభాగాల అధ్యక్షులు ఏటూరు రఘురామిరెడ్డి బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి కాలువ నరసింహులు జీ బాల అంకయ్య మెట్టుకూరు సుబ్బారెడ్డి ఎద్దుల శ్రీనివాసులరెడ్డి గోగుల బాల అంకయ్య నాయుడు హజరత్ రెడ్డి వైస్ ఎంపీపీ అల్లంపాటి పెంచలరెడ్డి రియాజ్ అహ్మద్ కల్పనారెడ్డి వెంకటరెడ్డి వెంగళరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి దాడి శ్రీనివాసులునాయుడు వినోద్ మల్లెం కొండయ్య ప్రసాద్ జమ్రు పెంచలయ్య నారాయణరెడ్డి శ్రీధర్ శివ సుధాకర్ విష్ణు ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక వైభవం!!

● రేణుక ఎల్లమ్మ సన్నిధిలో ప్రథమ వార్షికోత్సవ జాతర ● భక్తిశ్రద్ధలతో విశిష్ట పూజలు నిర్వహించిన గౌడ బాంధవులు ● భక్తితో పూజ.. ప్రేమతో వడ్డన ● తన్మయత్వంలో భక్తులు... పెద్ద ఎత్తున ఏర్పాట్లు




**పెద్దపల్లి/ గోదావరిఖని,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కొలువై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం అత్యంత అంగరంగ వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్థానిక గౌడ బాంధవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో విశిష్ట పూజలు నిర్వహించగా, ఆలయ పరిసరాలు 'జయహో ఎల్లమ్మ' స్మరణతో మారుమోగాయి. ఉదయం నుండే వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య లోక కల్యాణార్థం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అత్యంత ఘనంగా హోమ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు చేసి, నైవేద్యాలను సమర్పించి తమ కుటుంబాలు చల్లగా ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. గౌడ కులస్తుల ఐక్యతను చాటుతూ, సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకల్లో యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని జాతర వాతావరణాన్ని తలపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ఉత్సవం దిగ్విజయంగా ముగిసింది. కన్నుల పండువగా సాగిన ఈ వేడుక గోదావరిఖని పట్టణంలో భక్తి పారవశ్యాన్ని నింపింది. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని కోరుకుంటూ, ఈ ప్రథమ వార్షికోత్సవం స్థానికులలో మరుపురాని ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, స్థానిక గౌడ సంఘం నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో ఈ -కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** స్థానిక రాజేంద్రనగర్ నారాయణ ఈ-టెక్నో స్కూల్ లో శనివారం ఈ-కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.కె.వి. సుమంత్ మాట్లాడుతూ మన చిన్నారులు యుకేజీ నుండి 1వ తరగతికి ప్రమోషన్ పొందుతున్న ఈ గ్రాడ్యుయేషన్ వేడుకలో మీ అందరితో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ రోజు మీరు స్టేజ్ మీద గ్రాడ్యుయేషన్ క్యాప్ ధరించి నిలబడటం చూసి మేమంతా చాలా గర్వంగా భావిస్తున్నాం అని చెప్పారు. ఈ విశేష కార్యక్రమానికి క్లస్టర్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఈకిడ్జ్ కో ఆర్డినేటర్ ప్రతిభ, ఆర్ & డి హెడ్ మారియా మరియు చిన్నారుల తల్లిదండ్రులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. అనంతరం ఈ-కిడ్స్ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచారు.

## నేడు శ్రీ లక్ష్మీ గణపతి హోమం

**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** స్థానిక మెయిన్ రోడ్ లో వెంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం లో ది 05-04-2026.(ఆదివారం) సంకష్ట హర చతుర్థి సందర్భముగా శ్రీ స్వామి వారి ఆలయ ఆవరణలో సామూహికంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం పూజా కార్యక్రమము జరుగుందని కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ వాసు, చైర్మన్ సాయన రాజేష్ లు తెలిపారు. ఈ హోమం పూజలో పాలుగును భక్తులు రూ 516/-లు దేవస్థానం ఆఫీస్ నందు చెల్లించి మీ యొక్క గోత్ర నామములు నమోదు చేయించు కోవలసినదిగా ఈఓ మరియు చైర్మన్ కోరారు. అలాగే పూజా సామాగ్రి దేవస్థానం వారి సమకూర్చుదురని వారు తెలిపారు.

## ధర్మకర్తల దరఖాస్తులుకు ఆహ్వానం

**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** స్థానిక బంటుమిల్లి రోడ్ లో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ధర్మకర్తల నోటిఫికేషన్ వచ్చి యున్నదని కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ వాసు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తిగల ధర్మకర్తలు 20 రోజుల్లోపు దేవాదాయ శాఖ గొల్లపూడి కార్యాలయం నందు దరఖాస్తులు అందజేయవలెనన్నారు. అలాగే మిగిలిన విషయములు దేవస్థానం ఆఫీసు పనిచేయ వేళలో తెలుసుకోవచ్చని యార్లగడ్డ వాసు తెలియజేశారు.

## ఘనంగా డా॥ శ్యామ్యూల్ హనీమాన్ పుట్టినరోజు వేడుకలు



**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** హెూమియో పితామహులు డాక్టర్ శ్యామ్యూల్ హనీమాన్ పుట్టినరోజు ఏప్రిల్ 10వ తేదీ వరల్డ్ హెూమియోపతి డే గా జరుపుకుంటున్న సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు డాక్టర్ గురురాజు గవర్నమెంట్ హెూమియో హాస్పిటల్ తరపున హెూమియో అవగాహన సదస్సు మరియు వడదెబ్బ రాకుండ హెూమియో మెడిసన్స్ గుడివాడ బస్టాండ్, బాపూజీ నగర్ పరిసర ప్రాంతాలలో సుమారు 380 మందికి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఎండలోకి వెళ్ళేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥ టి.వి.ఆర్. యస్. యన్ జగదీశ్వర రావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా॥ యస్.జ్యోతి, మెడికల్ ఆఫీసర్ డా॥ బి. నాగేంద్రరావు మరియు జూనియర్ డాక్టర్స్ పాల్గొన్నారు.

## మైలవరం మండలంలోని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకం

**మైలవరం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** గ్రామ పంచాయితీ పాలకవర్గం పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగిసింది.దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనను ప్రవేశపెట్టింది.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసా గుతుందని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే.దీనిలో భాగంగా మైలవరం మండలం లోని 13 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రగూడెం,గణపవరం, మైలవరం గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో పి. అనురాధ(9100084660) చంద్రాల, కనిమెర్ల తండా,వెదురుబీడెం గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా డిప్యూటీ ఎంపీడీవో డి.జయప్రకాష్ (9849565112) కీర్తిరాయునిగూడెం, తోలుకోడు గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారిగా ఆర్ డబ్ల్యు ఎస్ ఏఇఇ నవీన్ కుమార్ (9949401949) మొర్సుమిల్లి,పొందుగల గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా తాహశీల్దార్ అబ్దుల్ దరియ(9849903972) పుల్లూరు, సీతారామపురం తండా, వెల్వడం గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారిగా డిప్యూటీ ఎంపీడీవో (జి ఎస్ డబ్ల్యూఎస్ అధికారిణి) యం.మౌనిక (9398458889)



శనివారం వాసవీ చౌక్ లోని కళ్యాణం వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో కొనకళ్ళ సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ళ సీతయ్య ఆధ్వర్యంలో కొనకళ్ళ వెంకటేశ్వరమ్మ జ్ఞాపకార్థం "ఉచిత మజ్జిగ పంపిణీ" కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పందన కార్యదర్శి నరహరశెట్టి ప్రసాదు ప్రారంభించారు. వైశ్య సంఘం నాయకులు పోకూరి మోహన్ రావు, బొగ్గవరపు తిరుపతయ్య, స్వామి రామ్మోహన్ రావు బెజవాడ బాజేశ్వర రావు గుంటూరు మల్లికార్జున రావు వెంకన్న బాబు అయిత గోపాలకృష్ణ తుమ్మలపల్లి నాగేశ్వరరావు చెక్క ఉమా శంకర్ కొల్లిపర్ర సాయి సుబ్రమణ్యం దుడ్డు చిన్న తదితరులు పాల్గొన్నారు.
**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :**

## బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో తో జోయాలుక్కాస్ వెలిగిపోనుంది

**కాకినాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ది వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్, జోయాలుక్కాస్, కాకినాడలో ఏప్రిల్ 4, 2026 నుండి కాకినాడ షోరూమ్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోతో కాంతి విరజిమ్మడానికి సిద్ధంగా ఉంది. ఈ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రదర్శన వజ్రాల ఆభరణాలలో నైపుణ్యం, సొగసు మరియు ఆవిష్కరణల యొక్క మరపురాని వేడుకగా ఉంటుందని వాగ్దానం చేస్తుంది. పెళ్లి సెట్ల నుండి ఆధునిక రోజువారీ మెరుపు వరకు, ఈ ప్రదర్శనలో శాశ్వత సంప్రదాయాన్ని ఆధునిక సౌందర్యంతో మిళితం చేసే ఆభరణాలు ఉన్నాయి. ప్రతి డిజైన్ ఒక కళాఖండం, ఇది ప్రదర్శన సమయంలో మాత్రమే పరిమిత కాలానికి అందుబాటులో ఉంటుంది. జోయాలుక్కాస్ గ్రూపు ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ ఇలా అన్నారు: "బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో అనేది వజ్రాల శాశ్వత ఆకర్షణకు ,ఆభరణాల రూపకల్పనలో పరిపూర్ణత పట్ల మాకున్న అభిరుచికి నివాళి. కాకినాడ మా ప్రయాణంలో ఒక ప్రత్యేక మైలురాయి, మరియు పండుగ సీజన్‌లో ఈ ప్రదర్శన వినియోగదారులకు అందం, వ్యక్తిత్వం మరియు నైపుణ్యాన్ని ప్రతిబింబించే డిజైన్‌లను కనుగొనడానికి ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది." ఈ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో హైదరాబాద్‌లోని




పంజాగుట్ట షోరూమ్‌లో మాత్రమే, 2026 ఏప్రిల్ 19 వరకు నిర్వహించబడుతుంది. విలాసానికి, ప్రేమకు మరియు శాశ్వతమైన అందానికి చిహ్నంగా నిలిచే ఈ అద్భుతమైన వజ్రాల ప్రపంచాన్ని సందర్శించవలసిందిగా అందరినీ ఆహ్వానిస్తున్నాము. ఇక్కడ ప్రతి ఆభరణం ఒక అందమైన కథను వినిపిస్తుంది.

## గద్దె రాము ఆశయ సాధనలో కార్యకర్తలు ముందుకు సాగాలి

- దొండపాడు మాజీ సర్పంచ్ గద్దె రాము ప్రథమ వర్ధంతి పాల్గొన్న కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని..

రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వైసిపి నాయకులు..



**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** వైఎస్సార్ సిపి నాయకుడు గుడివాడ రూరల్ ఎంపీపీ గద్దె పుష్పరాణి భర్త మాజీ సర్పంచ్ గద్దె రాము ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కృష్ణా జిల్లా వైసిపి అధ్యక్షుడు పేర్ని నాని, రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్, వల్లూరిపల్లి సుధాకర్ లు పాల్గొని రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాముతో తమకున్న జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పార్టీ కోసం రాము చేసిన సేవలను, ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని నాయకులు కొనియాడారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాము మరణం గుడివాడ రూరల్ ప్రాంతంలో పార్టీకి పెద్ద లోటని, ఆయన ఆశయ సాధనలో కార్యకర్తలు ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీపీ గద్దె పుష్పరాణి మరియు ఇతర కుటుంబ సభ్యులను పేర్ని నాని పరామర్శించి, ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొర్ల శ్రీను, సీనియర్ నాయకులు పాలేటి చంటి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మట్టా జాన్ విక్టర్, నందివాడ ఎంపీపీ పేయ్యల ఆదాము, నందివాడ జడ్పిటిసి కందుల దుర్గా కుమారి, గుడివాడ రూరల్ అధ్యక్షులు చిన్ని సత్య దుర్గాప్రసాద్, కందుల నాగరాజు, కసికుర్తి బాబ్జి, గిరి బాబాయ్, గంట సురేష్, గంట శీను, గోళ్ళ సోమేశ్వరరావు, గోళ్ళ రామకృష్ణ, కలపాల కిరణ్, గుదే రవి, కారే జోసెఫ్, కండవల్లి రవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మట్టా నాగమణి, మాదాసు వెంకటలక్ష్మి వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు గద్దె రాము అభిమానులు పాల్గొన్నారు.

## ఉత్కంఠ భరితంగా వెనిగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

- క్వార్టర్ ఫైనల్స్ కు ప్రవేశించిన శ్యాం బాబాయ్ ఎఫ్.సి, రాయల్ సీసీ, సుబ్బు సిసి, జీటీ 11





**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో జరుగుతున్న వెనిగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు విజయవంతంగా ముందుకు సాగుతున్నాయి. గత 16 రోజులుగా జరుగుతున్న పోటీలు క్వార్టర్స్ ఫైనల్స్ దశను పూర్తి చేసుకుంటున్నాయి. శనివారం జరిగిన పోటీల్లో వివిధ జట్లు సత్తా చాటాయి. ముబారక్ సిసి జట్టుపై - శ్యాం బాబాయ్ ఎఫ్.సి జట్టు.. అరిపిరాల టీమ్ పై - రాయల్ సీసీ.. గ్రోవెల్ టీం పై.. సుబ్బు సి సి.. తమిరిశ జట్టుపై - జీటీ 11 జట్లు విజయం సాధించి క్వార్టర్స్ ఫైనల్ కు చేరుకున్నాయి. అత్యుత్తమ ప్రదర్శన సాధించిన శ్యాంబాబు ఎఫ్. సి ప్లేయర్ తేజ, రాయల్స్ సీసీ ప్లేయర్ వంశీ, సుబ్బు సీసీ ప్లేయర్ రాజీవ్, జీటీ 11 ప్లేయర్ నాగార్జున మేన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందుకున్నారు. విజేతలకు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, తెలుగు యువత నాయకులు పంచకర్ల మహేష్, టిడ్కో అభివృద్ధి కమిటీ చైర్మన్ టిడ్కో నిరంజన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందించారు. చిన్న జట్టుగా ముందుకు వచ్చి పెద్ద జట్లపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నందుకు శ్యామ్ బాబాయ్ ఎఫ్.సి జట్టు కెప్టెన్ శ్యామ్, టీం మెంటర్ కడియాల గణేష్ హర్షం వ్యక్తం చేశారు. మరో వారం రోజుల్లో పోటీలు ముగుస్తాయని నిర్వాహకులు కటికల కళ్యాణ్, సమ్మెట వరుణ్ తెలిపారు.

## విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి..

-క్యాంప్ బెల్ పేట పాఠశాలనుఆకస్మిక తనిఖీ చేసిన డిఇఓ.

**మచిలీపట్నం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కృష్ణాజిల్లా డిఇఓ ఉద్బోధించారు. శనివారం క్యాంపు బెల్ పేట గ్రామం లో పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల ఇళ్లకు డిఇఓ సుబ్బారావు వెళ్లి తల్లిదండ్రులకు వారి విద్య పై సలహాలు సూచనలు అందించారు. పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల శ్రవణ, పఠన ,లేఖన, భాషణ, నైపుణ్యాలను పరిశీలించారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్యాంపు బెల్ పేట ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అంతేకాక జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల పరిధిలో 9వ తరగతి నుండి పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆయా విద్యార్థుల విద్యపై తల్లిదండ్రులతో ముచ్చటించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పదవ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల విద్య పట్ల ఈ సంవత్సరం ప్రారంభం నుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు ఎం వి ఎస్ డి ప్రసాద్ , వైఎస్ఆర్ కే గురుప్రసాద్ ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ఇంటింటి సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుపై ఆసక్తి, అభ్యసన స్థాయి, 10 వ తరగతి పాఠ్యాంశాలపై అవగాహన వంటి అంశాలపై చర్చిస్తూ, వారికి ప్రోత్సాహాన్ని అందించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ వేసవి సెలవులలో "బ్రిడ్జ్ కోర్స్" అమలు విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, విద్యార్థులు సమగ్రంగా నేర్చుకోవాలని సూచించారు. నేర్చుకునే విషయంలో లోటుపాట్లను



పూరించేందుకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు.అలాగే పాఠశాలలో అమలవుతున్న జి ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రామ్ పై సంబంధిత వాలంటీర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి, కార్యక్రమం అమలు తీరు, విద్యార్థుల పురోగతి, బోధన పద్ధతులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు మరింత పెంపొందించేందుకు ఆధునిక బోధన విధానాలు అవలంబించాలని ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు, వాలంటర్ లకు సూచించారు. ఇంకా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని, రెగ్యులర్ మానిటరింగ్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులను ఆదేశించారు.

## డి హెచ్ పిఎస్... రెండో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి..

- దళిత హక్కుల పోరాట సమితి వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మల్లేశం

**జవహర్‌నగర్,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఈనెల 17, 18 వ తారీకు న జరిగే డి.హెచ్.పి.ఎస్ రెండవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, జవహర్ నగర్ లోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో శనివారం వాల్పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మల్లేశం హాజరై మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు అనగారిన వర్గాలను అణచి వేస్తూనే ఉన్నాయని మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాల పరిపాలనలో నేటికీ దళితులపై జరుగుతున్న దాడులు ఆగట్లేదని అంటరాని తనం కులవివక్షత ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితులను నేటికీ అన్ని రంగాల్లో అభివృద్ధికి ఆ మడ దూరంలో నెట్టి వేస్తున్నాయన్నారు. ఈనెల 17 ,18 వ తారీకుల్లో వరంగల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు ప్రజా



సంఘాలు, మేధావులు, హాజరై ఈ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోటపల్లి శంకర్, యాదగిరి, ఎల్లయ్య, శంకర్, సోమయ్య, జయమ్మ, మల్లిక, కృష్ణ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదాం

- పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** సౌరశక్తి వినియోగంపై ప్రజలను ప్రోత్సహిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదామని, పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు.ఇబ్రహీంపట్నం మండలంలోని కేతనకొండ గ్రామంలో పలు గృహాలపై అమర్చిన సౌర విద్యుత్ ఫలకాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శనివారం పరిశీలించారు. నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ) - సూర్యాంధ్ర ప్రగతి రథ శకటాన్ని జెండా ఊపి ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులు ఇళ్లకు అమర్చిన నూతన సోలార్ విద్యుత్తు కనెక్షన్లను ప్రారంభించారు. వారితో మాట్లాడి సౌరవిద్యుత్తు వల్ల కలిగే లాభాలను వివరించారు.ఈ సందర్భంగా వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన పథకంతో విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి లభించడంతో పాటు పర్యావరణ హిత జీవితానికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఎన్ఎస్ఈఎఫ్ఐ - సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ రథం ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలు ప్రజలకు తెలియజేస్తున్నట్లు వివరించారు. ప్రజల. భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) తదితరులు పాల్గొన్నారు.

## పార్శిల్ ప్యాకేజింగ్ యూనిట్లు

**గుడివాడ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ప్రజల పార్శిల్ ప్యాకింగ్ సమస్యను తపాలా శాఖ గుర్తించి, గుడివాడ డివిజన్లోని సబ్ పోస్టాఫీసులల్లో పార్శిల్ ప్యాకేజింగ్ యూనిట్లు ప్రారంభించినట్లు సూపరింటెండెంట్ ఎస్, కృష్ణమూర్తి తెలిపారు. గుడివాడ హెడ్ పోస్టాఫీస్, నూజివీడు సబ్ పోస్టాఫీస్, కైకలూరు సబ్ పోస్టాఫీస్, ముదినేపల్లి సబ్ పోస్టాఫీస్, బంటుమిల్లి సబ్ పోస్టాఫీస్, హనుమాన్ జంక్షన్ సబ్ పోస్టాఫీస్ లలో పార్శిల్ ప్యాకేజింగ్ యూనిట్లను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పార్శిల్ ప్యాకింగ్ కోసం కనీస రుసుము మాత్రమే వసూలు చేస్తామన్నారు. ప్రజల సౌకర్యార్థం, పార్శిల్ ప్యాకింగ్, బుకింగ్ సేవలు ఒకే చోట పోస్టాఫీసులలోనే ఉంచనున్నామన్నారు. ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని సూపరింటెంటెంట్ కోరారు.

## కనీసం ప్రధాన రహదారిలో నైనా వీధి దీపాల ఏర్పాటు చేయండి - బిజెపి నాయకుల వినతి




**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మియాపూర్ సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటి నుంచి జేపీ నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారిలో వీధి దీపాల లేమి స్థానికులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది.ముఖ్యంగా రాత్రి వేళల్లో చీకటి కారణంగా పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి.పనిచేయని వీధి దీపాలను తక్షణమే మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన ప్రదేశాల్లో కొత్త దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ ఉమ్మడి మియాపూర్ డివిజన్ నాయకులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, గుండె గణేష్ ముదిరాజ్, జాజార శ్రీనివాస్ కోరారు.

## అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, వీఎంసి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశ శనివారం ఉదయం గాంధీజీ మహిళా కళాశాల వద్దగల అన్న క్యాంటీన్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టోకెన్ కౌంటర్‌లో ఐదు రూపాయలు చెల్లించి క్యూలో నుంచొని, అక్కడ భోజనానికి వచ్చిన ప్రజలతో వారి సమస్యలను అన్నా క్యాంటీన్ పై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ తాము కూడా ఆహార నాణ్యత పరీక్షించేందుకు భోజనం చేశారు. అన్న క్యాంటీన్లో వసతులు ఎలా ఉన్నాయి? వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఐదు రూపాయలకి ప్రభుత్వం భోజనం అందించడం చాలా సంతోషకరమైన విషయమని వారు సగర్వంగా కేవలం 15 రూపాయలకే ఎవరి దగ్గర చేయిచాచకుండా వారి రోజుని గడుపుతున్నామని దీనికి ప్రభుత్వానికి వాళ్ళు కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలతో రైతన్నలకు భరోసా

● మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ●కొటికలపూడిలో పట్టాదారు పాసుబుక్స్ పంపిణీ



**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు ద్వారా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కొటికలపూడి గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పబ్లిసిటీ పిచ్చితో పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో వేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాజముద్రతో ఉన్న కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తోందన్నారు. తప్పులను సరిదిద్ది భూవివాదాలు లేకుండా చేయడమే తమ ప్రభుత్వ కర్తవ్యం అని వివరించారు. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఒకప్పుడు రైతులే అధికారులు చుట్టూ తిరిగేవారు. పాస్ పుస్తకం వస్తే రైతులకు అదో వరం. ప్రజా ప్రతినిధులు సైతం ప్రభుత్వం వద్ద సంప్రదింపులు జరిపి పాస్ పుస్తకాలు మంజూరు చేసేలా గట్టి ప్రయత్నాలు చేసేవారు. అటువంటిది ఇప్పుడు అధికారులే పట్టాదారు పుస్తకాలు ఇస్తామంటూ రైతులు చుట్టూ తిరుగుతున్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జనంపల్లి పురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు..





**కూకట్‌పల్లి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, పిఏసి చైర్మన్ అధ్యక్షులు పురేందర్ రెడ్డి కి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్, సంజీవరెడ్డి, ఆర్. కార్తీక్ రావు, మల్లయ్య, కాశీనాథ్ యాదవ్,ఈ. రాజేందర్, పటేల్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. అనంతరం రామకృష్ణ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మరియు పురేందర్ రెడ్డి మిత్రబృందం సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అధ్యక్షులు పురేందర్ రెడ్డి కి గండపెండారం,కంకణం బహుకరించి సత్కరించారు. కాలనీ సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నందుకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. ప్రసాద్, వి. తాండవ కృష్ణ సమక్షంలో గండపెండారం బహుకరించగా, కమిటీ సభ్యులు శ్రీధర్, సూర్యనారాయణ, మూర్తి, నాగేందర్ రెడ్డి, సీకే రెడ్డి, అరవింద్ కుమార్, గ్రానైట్ సూర్యనారాయణ,టైగర్ పురుషోత్తం,కిషోర్,సునీల్, లక్ష్మీనారాయణ, కె.వి.రావు, సతీష్,నాని,రిత్విక్ రోహిత్, జగదీష్,కుమార్,రవీందర్ నాయక్,అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు. వేద పండితులు కిరణ్ పంతులు సమక్షంలో వేదమంత్రాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పత్రికా ప్రతినిధులు, విలేకరులు కూడా అధ్యక్షులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ,తనకు గండపెండారం బహుకరించడం ఎంతో ఆనందంగా,గౌరవంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిత్రులు, స్నేహితులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు మరియు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహిళా ఉద్యమ నేత గుజ్జుల సరళ దేవి లాల్ సలాం

● నివాళులర్పించిన మహిళా నేతలు



**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** మహిళా ఉద్యమ నేత గుజ్జుల సరళదేవి ఘన నివాళులర్పించిన మహిళా నేతలు. మహిళా సమాఖ్య నగర కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ పేట, దాసరి భవన్ వద్ద గుజ్జుల సరళా దేవి 28 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ. ఈ సందర్భంగా నగర అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతీ, పంచదార్ల దుర్గాంబలు మాట్లాడుతూ గుజ్జుల సరళాదేవి విద్యార్థి దశ నుండే వామపక్ష భావాల తో ఉద్యమ బాటపట్టారని,కల్లు మానండోయ్ బాబు,కళ్ళు తెరవండోయ్ బాబు, వళ్ళు గుల్లగునోయ్ బాబు కల్లు వల్ల శాంతి లేదంటూ బాబు ... ఈ పాటతో ఊరూరా తిరిగి మహిళలను చైతన్య పరిచే వారిని గుర్తు చేశారు. 1936 గుంటూరు జిల్లా గురజాలలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మందపాటి నాగిరెడ్డి అన్న మందపాటి పేరిరెడ్డి లక్ష్మీదేవి దంపతులకు సరళ దేవి జన్మించారని చెప్పారు.బాల్యం నుండే,పువ్వు పుట్టగానే పరిమళించినట్టుగా కమ్యూనిస్టు ఉద్యమ త్యాగాల స్ఫూర్తితో సాంఘిక దురాచారాలకు, మద్యపానానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసే దిశగా అడుగులు వేశారని కొనియాడారు.ఈ క్రమంలో కల్లు వ్యతిరేక ఉద్యమం నడిపిన కమ్యూనిస్టు అగ్రనాయకుల్లో ఒకరైన గుజ్జుల ఎలమందరెడ్డితో వివాహం జరిగిందన్నారు. అనంతరం స్త్రీ, పురుష వేతన సంఘంలో నిరక్షరాస్యత, నిర్మూలన సంఘంలో ఆమె పనిచేస్తూ,వయోజన మహిళల కోసం కేవలం మూడు సంవత్సరాల్లో సుమారు 300 స్కూల్ నిర్వహించారని తెలిపారు. అంతేకాకుండా మద్యపాన నిషేధం,వరకట్న నిషేధం, దురాచారాలపై ఆమె పాటలు రాసి పాడేవారని,ఆమె నాయకత్వంలో కార్యకర్తలు ఊరూర తిరుగుతూ కళా ప్రదర్శన ఇచ్చేవారని,స్త్రీ హస్తిహక్కు, వివాహ రక్షణ హక్కు,వారసత్వ దత్తత స్వీకరణ హక్కు,మనోవర్తి హక్కుల సాధనకై ఉద్యమించారు. 33% రిజర్వేషన్ కోసం హైదరాబాదులో ఆమె నాయకత్వంలో జరిపిన ప్రదర్శనలు ప్రముఖమైనదన్నారు. పార్టీ ఉద్యమాల్లో భర్తతో ప్రముఖ పాత్ర పోషిస్తూ.. 1970లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి,నిర్మాణాన్ని పటిష్ట పరచడంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారన్నారు. 1994లో కురుక్షేత్రంలో జరిగిన 14వ జాతీయ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని తెలిపారు.ఉద్యమమే ఊపిరిగా జీవిస్తూ.. 1998 ఏప్రిల్ 4న అకాల మృతి,మహిళా ఉద్యమానికి తీరని లోటు అన్నారు.ఆమె పేరు మీద సింగ్ నగర్ లో కళ్యాణ మండపం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు దుర్గాసి రమణమ్మ, దుగ్గిరాల సీతారావమ్మ, చింతాడ పార్వతి, నీలాపు భాగ్యలక్ష్మి, ఎస్ కె. నాగూర్ బి, వేలాంగణి రాణి,బి,నాగ మల్లేశ్వరి,షైనీ, నాగేంద్రం ,తదితరులు పాల్గొన్నారు.


# గొర్రెలు అపహరణ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



బాధితుడు మాముదూరు పుల్లయ్య

**చేజర్ల,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** చేజర్ల మండలంలోని మాముదూరు గ్రామానికి చెందిన మాముదూరు పుల్లయ్య తండ్రి మాముదూరు మస్తానయ్య అను వ్యక్తి గొర్రెలు మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే మాముదూరు గ్రామంలోని వినాయక స్వామి గుడి పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ పక్కన గొర్రెలకు చుట్టూ కంచె వేసి అందులో రోజు పొద్దున్నే తోలేవాడినని. తరువాత మేతకు తోలి సాయంత్రం 6:30 కి గొర్రెలను దొడ్డిలో తోలేవాడినని అయితే రోజులాగే దొడ్డిలోనే పడుకునేవాడినని కానీ మార్చి 02వ తేదీన ఆరోగ్యం సరిగా లేనందున ఇంట్లో పడుకోవాల్సి వచ్చిందని ఆరోజు నా గొర్రెల మందలో నుండి 02 గొర్రెలు పోయాయని తెలిపారు. గొర్రెల కోసం చుట్టుపక్కల వెతికినా కనిపించలేదని ప్రక్కన ఉన్న గ్రామాల్లో వెతికినా కనిపించలేదని చెప్పారు.అదేవిధంగా ఏప్రిల్ 03వ తేదీన మరలా ఆరోగ్యం సరిగా లేనందున ఇంట్లో పడుకున్నానని అదే రాత్రి పెద్ద పొట్టేలు సుమారు 26000 రూపాయలు విలువగల పొట్టేలు పోయిందని తెలిపారు. ఇదంతా చూస్తే నా గొర్రెలను ఎవరో అపహరిస్తున్నట్లు అనుమానం వచ్చిందని తెలిపారు. ఇది ఎవరో కావాలని చేస్తున్నారా లేక గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా వచ్చి నా గొర్రెలను అపహరించుకుని వెళ్తున్నారా అనే కోణంలో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేయడం జరిగినది.

# హాక్ ఫ్యూజన్ 2026 పేరిట ఇంటర్నేషనల్ హ్యాకథాన్




**కూకట్ పల్లి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జేఎన్టీయూ వేదిక వెలిసింది. యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్మెంట్, బ్రెయిన్ ఓ విజన్ ఆధ్వర్యంలో హాక్ ఫ్యూజన్ 2026 పేరిట ఇంటర్నేషనల్ హ్యాకథాన్ పేరిట రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిన్ ఓ విజన్ ఫౌండర్ సీఈవో గణేష్ మాట్లాడుతూ వివిధ కళాశాలలో చదువుకునే విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని సృజనాత్మకతను వెలికి తీసేందుకే గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఏడు రాష్ట్రాల నుండి 95 కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో వచ్చిన నూతన ఆలోచనలను వివిధ మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన వారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి వీరిలో మంచి ఐడియాను గుర్తించి వారికి 75 వేల రూపాయల నగదు బహూకరణ చేస్తారని అన్నారు. విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అలా అని నూతన ఆవిష్కరణలు కూడా జరుగుతాయని అన్నారు.

# కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై మాజీ కార్పొరేటర్ సమరభేరి!!

● ప్రజా సమస్యలపై మేయర్ మహంకాళి స్వామికి వినతి

● సంపు ఉన్నా తీరని దాహం.. పనులు సగమే ఉన్నా పట్టించుకోని అధికారులు



**పెద్దపల్లి/ గోదావరిఖని,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ రైల్వే స్టేషన్ ఏరియాలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ మేయర్ మహంకాళి స్వామికి వినతి పత్రం సమర్పించారు. భరత్ నగర్, తబితాశ్రమం, ఎస్టీ కాలనీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సంపు నిర్మాణం పూర్తి చేసి, మోటార్లు ఏర్పాటు చేసినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నేటికీ నీటి సరఫరా జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎండాకాలం నుండే నీరు అందించాల్సి ఉన్నా, అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే రైల్వే స్టేషన్ ప్రధాన కాలువ నిర్మాణం సగంలోనే నిలిచిపోవడంతో వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, స్థానిక కాంట్రాక్టర్లు, అధికారుల ఉదాసీనత వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. వెంటనే స్పందించి సంపు ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రధాన కాలువ పనులతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మేయర్ సానుకూలంగా స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పనులు పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం మున్సిపల్ మేయర్ చాంబర్‌లో జరిగింది.

# ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం ఫైల్ దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉంటే క్రమశిక్షణ చర్యలు తప్పవు- డిప్యూటీ డైరెక్టర్ రంగరాజు అల్లాడి

**విజయవాడ పశ్చిమ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం ఫైల్ దీర్ఘకాలంగా పెండింగ్లో ఉంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రంగరాజు అన్నారు. శనివారం మధ్యాహ్నం విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నూతన భవనంలోని మీటింగ్ హాల్ లో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం టి డి ఆర్ బాండ్స్ బిల్డింగ్ ప్లాన్ లపై డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఓపెన్ ఫారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం పొడిగించిన గడువు ఏప్రిల్ 23, 2026 తో ముగియనున్న నేపథ్యంలో సిబ్బంది ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం లో గల ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, దీర్ఘకాలంగా పెండింగ్లో ఫైలు ఎవరి వద్ద ఉంటుందో వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని అన్నారు. ఓపెన్ ఫారంలో పాల్గొన్న ప్రజలలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ లో స్పాట్ పేమెంట్ చేయగా వారి ప్రొసీడింగ్స్ ను వెంటనే జారీ చేశారు. టిడిఆర్ బాండ్స్, బిల్డింగ్ ప్లాన్స్ పై ప్రజల సందేహాలను తీర్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు ఆర్. డి డి. టి పి , రాజ్యలక్ష్మి ఏడి డి టి పి, వై రాంబాబు ఏసీపీ, పి. మోహన్ బాబు ఏసిపి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




# క్రీ.శే.చింతా వెంకటేశ్వరరావు (బుల్లి) విగ్రహావిష్కరణ

● ఘన నివాళులు అర్పించిన ప్రముఖులు

కేశినేని చిన్ని, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), నెట్టెం శ్రీ రఘురామ్..



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు మండలం లోని నవాబుపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, సొసైటీ అధ్యక్షులు కీ.శే. శ్రీ చింతా వెంకటేశ్వరరావు (బుల్లి) ఇటీవల పరమపదించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నిర్వహించిన సంతాప సభలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) , ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , కెడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ , చావల దేవధత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం చింతా వెంకటేశ్వర రావు (బుల్లి ) విగ్రహాన్ని ఆవిష్కరించారు.. అనంతరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ చింతా వెంకటేశ్వరరావు (బుల్లి) మన మధ్య లేకపోవడం తీవ్ర విషాదకరమని తెలిపారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి నిత్యం ప్రజాసేవలో నిమగ్నమైన నాయకుడిగా ఆయనను గుర్తుచేశారు. ఆయనలాంటి నాయకులు సమాజానికి ఆదర్శమని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. గ్రామ ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఎంతో గొప్పదని, ఆయన మరణం గ్రామానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు. అలాగే, బుల్లి ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. బుల్లి కలలు కనిన గ్రామ అభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. గ్రామంలో హైస్కూల్ ఏర్పాటు ఇళ్ల స్థలాల పంపిణీ చెరువు సమస్య పరిష్కారం. ఈ అంశాలపై చర్యలు తీసుకుని ఆయన ఆశయాలను సాకారం చేస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వేగినేటి గోపాల కృష్ణ మూర్తి, మాజీ జెడ్ పి టీ సి గజ్జి కృష్ణ మూర్తి, కట్టా నరసింహారావు,వేముల వెంకటేశ్వర రావు, జిల్లేపల్లి సుదీర్ బాబు, గింజుపల్లి రమేష్, గింజుపల్లి వెంకటేశ్వర్లు,ఐ లపోగు వెంకటేశ్వర్లు,జామ ఆనందరావు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం అవగాహన సదస్సు

● పాల్గొన్న బిజెపి నాయకులు కోట్రపోలు కృష్ణ



**ముదినేపల్లి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి హనుమంతరావు ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకం పై అవగాహన సదస్సు ముదినేపల్లి మండలంలోని పెద్దగొన్నూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గములకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకం ద్వారా కార్మికులకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ఈ పథకాన్ని ప్రతి అర్హులైన చేనేత కార్మికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు పరసా ఏడుకొండలు, మండల బీజేపీ నాయకులు చిట్టూరి శివప్రసాద్, నచ్చిరెడ్డి వెంకన్న, కొల్లిపర నాగరాజు, భండారు పాండు రంగారావు పాల్గొని, చేనేత కార్మికులకు పథకం ప్రయోజనాలపై వివరించారు. అలాగే పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు హాజరై పథకం వివరాలు తెలుసుకుని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# పర్యావరణ పరిరక్షణలో మరో అడుగు!!

● జిడికె సి.యస్.పిలో నూతన వాటర్ ట్యాంకర్ ప్రారంభం

● బొగ్గు గనుల్లో దుమ్ముకు చెక్

● రవాణా దారుల్లో ధూళిని అరికట్టుతాం-ఏజెంట్ రమేష్





**పెద్దపల్లి/ గోదావరిఖని,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** రామగుండం రీజియన్-1 పరిధిలోని జిడికె సి.యస్.పి నుండి ఓసి-5 బొగ్గు రవాణా రహదారిలో దుమ్ము, ధూళిని అరికట్టేందుకు నూతనంగా కొనుగోలు చేసిన 12 కె.ఎల్.డి సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్‌ను జీడీకే-1 గ్రూప్ ఏజెంట్ ఎల్. రమేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం బొగ్గు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో ఈ ట్యాంకర్ ద్వారా నీటిని స్ప్రే చేయడం జరుగుతుందని వివరించారు. నిరంతరం నీటిని చల్లడం వల్ల అటు కార్మికులకు ఆరోగ్య రక్షణతో పాటు, ఇటు పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని, పని ప్రదేశం పరిశుభ్రంగా ఉండటమే కాకుండా కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పక్కాగా పాటించినట్లు అవుతుందని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంస్థ కట్టుబడి ఉందని, ఇలాంటి చర్యల ద్వారా కాలుష్య రహిత గనుల నిర్వహణ సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, జీడీకే 1,3 గని మేనేజర్ జక్కుల్ వార్ సుధీర్, పర్యావరణ అధికారి వేణు, సి.యస్.పి ఇంజనీర్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దుమ్ము సమస్య పరిష్కారానికి అధికారులు తీసుకున్న ఈ చొరవపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

# పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధాల మధ్య అన్నమ స్వరార్చన



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** అన్నమయ్యపురంలో పద్మశ్రీ డా. శోభారాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమ స్వరార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన ప్రసాదం వితరణ చేసి, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం,లక్ష్మీ అష్టోత్తర శతనామావళి, అన్నమయ్య అష్టోత్తరం,అన్నమ గాయత్రి (గురు స్తుతి)తో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అన్నమాచార్య భావనా వాహిని శిష్యురాలు కుమారి ఆశ్రిత తన తొలి అన్నమయ్య స్వరార్చనను శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామివారికి సమర్పిస్తూ స్వరంగేట్రం చేసింది. చిన్ననాటి నుంచే పద్మశ్రీ డా. శోభారాజు వద్ద శిక్షణ పొందుతున్న ఆశ్రిత మధుర స్వరాలతో భక్తులను ఆకట్టుకుంది. "మాతృదేవో భవ", "అంబికే జగదంబికే", "నమామ్యహం", "కొలిచితే రక్షించె", "సిరుత నవ్వులవాడు" వంటి అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి విశేషంగా మెప్పించింది. కీబోర్డు రాజు, తబల రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు. పద్మశ్రీ డా. శోభారాజు సంకీర్తనకు భావార్థ వివరణ ఇస్తూ ఆశ్రిత గానాన్ని అభినందించారు. భక్తి,లయ,సాహిత్య సమన్వయంతో సాగిన ఈ స్వరార్చన భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచిందన్నారు. జూతదనంతరం సంస్థ తరఫున ఆశ్రితతో పాటు వాద్య కళాకారులను సత్కరించి, మంగళహారతితో కార్యక్రమాన్ని ముగించారు.

# పారిశ్రామిక వేత్త గుత్తికొండ కోటేశ్వరరావు మృతి



**చల్లపల్లి: అవనిగడ్డ,ఏప్రిల్ 4 (వార్తాప్రభ) :** ప్రముఖ పారిశ్రామికవేత్త గుత్తికొండ కోటేశ్వరరావు(70) మృతి చెందారు. చల్లపల్లి మండలం రామానగరంలోని స్వగృహంలో శనివారం సాయంత్రం ఆయన కన్నుమూశారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృదుస్వభావిగా ,గుప్తదాతగా పేరున్న కోటేశ్వరరావు మృతి సమాచారం తెలియటంతో ఆయన భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు వివిధ వర్గాల ప్రజలు, పలువురు అధికార అనధికార ప్రముఖులు రామానగరంలోని ఆయన స్వగృహానికి తరలివచ్చి ఘన నివాళులు అర్పించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188